


# అక్షరకలం

epaper. aksharakalam. com

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com




సంపుటి : 19 సంచిక : 121 | 22-07-2026 బుధవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 8 వెల : రూ.1.00




వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ

# కళ్యాణోత్సవం

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు

ఉత్సవానికి హాజరైన సిఎం సతీమణి


2 లో..

బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణోత్సవానికి సిఎం రేవంత్ సతీమణి కూతురుతో కలిసి హాజరయ్యారు. అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మాజీమంత్రి తలసాని కూడా హాజరయ్యారు. వీరి రాకతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు.

## ప్రధాని నివాసం ముందు కాంగ్రెస్

# మెరుపు ధర్నా

జంతర్‌మంతర్ ఆందోళనకారులపై లాఠీచార్జ్‌కు నిరసన

ప్రధాని మోడీ రాజీనామా చేయాలన్న రాహుల్ గాంధీ

భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. గూండాగిరి, నిరంకుశత్వం వద్దంటూ.. అణచివేత చర్యలు నడవవంటూ నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు దౌర్జన్యం చేస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేసారు.

వార్త 2లో





పశ్చిమాసియాలో

## పరిస్థితి మళ్లీ ఉద్రిక్తం

అమెరికా–ఇరాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధం చేస్తోందని ప్రకటించారు.

2



అసోంను ముంచెత్తిన

## వరదలు

అస్సాంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. భారీ వానల కారణంగా ఇప్పటివరకు 10 మంది మృతిచెందగా, లక్షల మంది నిరాశ్రయులయ్యారు.

## ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

సాగు,తాగునీటి సవాళ్లను ఎదుర్కొనేలా చర్యలు

డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి



హైదరాబాద్,

ఎల్ నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు తెలంగాణ సర్కార్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎల్ నినోపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి గ్రామంలో ఎల్ నినోపై అవగాహన కల్పించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులకు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. పగటి పూట సోలార్ విద్యుత్ వినియోగం పెంచి ఆర్థిక భారం తగ్గిస్తామని చెప్పారు. ఎల్ నినో కారణంగా వర్షాకాలంలోనూ వేసవిలో ఉన్నంత విద్యుత్ డిమాండ్ ఉందని వివరించారు.


2

కాక్రోచ్ పార్టీ ఆందోళనపై

## కేంద్రం అప్రమత్తం

విద్యార్థులతో చర్చించేందుకు సిద్ధమని సంకేతాలు

లాఠీ-ఛార్జ్‌లో గాయపడ్డ విద్యార్థులను పరామర్శించిన జెపి నడ్డా


2

## పార్లమెంట్లో ప్రతిపక్ష నేతలకు సమాధానం ఇవ్వరా

## జమ్మూ కాశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్

### కొండ చరియలు విరిగి పడి పలువురు గల్లంతు

### వరదలతో ఇప్పటికే పలువురు మృతి

శ్రీనగర్

జమ్మూకశ్మీర్‌లో మేఘ విస్ఫోటం కారణంగా సంభవించిన ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడటం, వరదల కారణంగా సరిహద్దు జిల్లాలైన పూంఛ్, రాజౌరీల్లో ఇప్పటికే 12 మంది మృతి చెందగా.. పలువురు గల్లంతయ్యారు. రోడ్లు, ఇళ్లుసహా పలు ప్రభుత్వ, ప్రైవేటు మౌలిక సదుపాయాలు చాలావరకు దెబ్బతిన్నాయి. దీంతో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సోమవారం దిల్లీలో రాష్ట్ర హోదా కోసం తలపెట్టిన ఆందోళనను విరమించుకుని జమ్మూకు హుటాహుటిన బయల్దేరి వెళ్లారు. పూంఛ్ జిల్లాలోని సురన్‌కోట్ తెహసీల్ ప్రాంతంలో ఎక్కువ విధ్వంసం జరిగింది. ఇక్కడే అధికంగా 10 మరణాలు సంభవించాయి. 9 మృతదేహాలు లభ్యమైనప్పటికీ.. కనీసం 16 మృతి చెంది ఉండే అవకాశం ఉందని పూంఛ్ డిప్యూటీ కమిషనర్ అశోక్ కుమార్ శర్మ తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లోని రియాస్ జిల్లాలో వర్షాలవల్ల మాతా వైష్ణోదేవి యాత్రను తాత్కాలికంగా నిలిపేశారు. సురన్‌కోట్ తెహసీల్ ప్రాంతంలో సంభవించిన మేఘ విస్ఫోటం మహమ్మద్ లతీఫ్ అనే ఒక వ్యక్తి జీవితంలో ఊహించనంత విషాదాన్ని నింపింది.

## సిజెపి మార్చ్ సందర్భంగా లాఠీఛార్జ్ దురదృష్టకరం

### ఈ ఘటనపై ప్రధాని మోడీ మౌనం వీడాలి

### పార్లమెంటులో అత్యవసరంగా చర్చించాలి: రాహుల్

న్యూఢిల్లీ,

:ఢిల్లీలో సీజేపీ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యను కాంగ్రెస్ అగ్రనాయకుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఖండించారు. ఈ



ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడాలని డిమాండ్ చేశారు. పోలీసుల లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగంలో గాయపడిన విద్యార్థులను రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ కలిసి పరామర్శించనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, విద్యార్థులపై జరిగిన పోలీసు చర్య గురించి ప్రధాని మోదీ ఇప్పటివరకు స్పందించకపోవడం ఆశ్చర్యకరమన్నారు. విద్యార్థులపై జరిగిన ఘటనకు ప్రధాని క్షమాపణ చెప్పాలని, ఇలాంటి చర్యలు వెంటనే ఆగాలని డిమాండ్ చేశారు.



హైకోర్టులో హైడ్రా

## కమిషనర్‌కు చేదు అనుభవం

గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని సెక్యూరిటీ సూచన

రంగనాథ్ వ్యవహార శైలిపై హైకోర్టు ఆగ్రహం

# ప్రధాని నివాసం ముందు కాంగ్రెస్ మెరుపు ధర్నా

## జంతర్‌మంతర్ ఆందోళనకారులపై లాఠీఛార్జ్‌కు నిరసన

### ప్రధాని మోడీ రాజీనామా చేయాలన్న రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**



భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. గూండాగిరి, నిరంకుశత్వం వద్దంటూ.. అణచివేత చర్యలు నడవవంటూ నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు దౌర్జన్యం చేస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేసారు. ధర్నా సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. నిన్న యువతపై లాఠీచార్జ్‌కు బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చకు అంగీకరించలేదని అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో జవాబుదారీతనం లేదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ మౌనం వీడాలని, నీట్ అంశంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ మార్చ్ సందర్భంగా ఢిల్లీ పోలీసులు విద్యార్థులు, నిరసనకారులపై లాఠీఛార్జ్ చేశారు. విద్యార్థులపై అణచివేతకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గేలతో పాటు కాంగ్రెస్ నాయకులు లోక్‌కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. ఈ ధర్నాలో పవన్ ఖేరా, పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షులు అమరీందర్ సింగ్ రాజా వారింగ్, దీపేందర్ హూడా, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ సహా పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. విద్యార్థుల్ని బీజేపీ ప్రభుత్వం క్రూరంగా హింసించిందని, కానీ బాధ్యత వహించడానికి, పార్లమెంట్‌లో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ నేతల ధర్నాతో ఒక్కసారిగా ఢిల్లీలో హైడ్రామా చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే, కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ కాంగ్రెస్ ధర్నా చేస్తున్న ప్రదేశానికి చేరుకుని రాహుల్ గాంధీతో చర్చిస్తున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఆ ప్రాంతాన్ని వెంటనే ఖాళీ చేయాలని రాహుల్ గాంధీకి నచ్చచెప్పేలా ప్రయత్నిస్తున్నారు. రాహుల్‌తో పాటు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో చర్చించారు. మరోవైపు, కాంగ్రెస్ శ్రేణులు రాజీనామా చేయాలంటూ నినాదాలు చేస్తున్నారు.

# వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

### అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు

### ఉత్సవానికి హాజరైన సిఎం సతీమణి



**హైదరాబాద్, , అక్షరకలం ప్రతినిధి**

బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణోత్సవానికి సిఎం రేవంత్ సతీమణి కూతురుతో కలిసి హాజరయ్యారు. అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మాజీమంత్రి తలసాని కూడా హాజరయ్యారు. వీరి రాకతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు. ప్రత్యేక సమీక్షలు చేసి, ఇచ్చిన ఆదేశాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పట్లు చేయడంతో ఘనంగా కల్యాణం జరిగిందని తెలిపారు. వికలాంగులు, జోగినిలకు ప్రత్యేక క్యూ లైన్స్ ఏర్పాటు చేయడంతో తోపులాట, తొక్కిసలాట జరగలేదన్నారు. జోగినిలకు ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు వారు తెచ్చిన పట్టువస్త్రాలను అమ్మవారికి చేరవేశామని.. వారిని గ్యాలరీలో తమతో సమానంగా కూర్చునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల కోసం వరుణయాగం జరుగుతోందన్నారు. నిజాం కాలం నుంచి అమ్మవారికి ప్రాముఖ్యం ఉందన్నారు. అమ్మవారిని దర్శించుకొంటే కోరికలు నేరవేరుతాయని నమ్మకమని చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం బ్జడెట్ కేటాయించిందని అన్నారు. ఖర్చుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు బడ్జెట్ కేటాయించామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మహిమగల బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం.. లోకకల్యాణం కోసం ఘనంగా జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గతంలో ఎన్నో విపత్తులు ఎదుర్కొన్నామని.. ఎన్‌లినోను కూడా ఎదుర్కుంటామన్నారు. అమ్మవారి కృపాకటాక్షంతో వర్షాలు కురుస్తాయని చెప్పారు. సంవృద్ధిగా వర్షాలు పడాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆషాఢమాస బోనాలు ఘనంగా జరిగేలా దేవాదాయ శాఖ తరఫున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్ని ఏర్పాట్లు చేసినా చిన్న చిన్న ఇబ్బందులు జరుగుతుంటాయని.. వాటిని అధిగమించి అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకోవాలని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదం రాష్ట్ర మీద ఉండాలని, సుఖశాంతులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

# పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ ఉద్రిక్తం

### పూర్తిస్థాయి యుద్ధం చేస్తున్నామన్న ఇరాన్

**టెహ్రాన్, అక్షరకలం ప్రతినిధి**

అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధం చేస్తోందని ప్రకటించారు. ప్రస్తుతం కేవలం సైనిక పరంగానే కాకుండా ఆర్థిక రంగంలో కూడా తీవ్ర పోరాటం కొనసాగుతోందని, ప్రజల జీవనోపాధిని కాపాడటం ప్రభుత్వానికి అత్యంత కీలక బాధ్యతగా మారిందని ఆయన పేర్కొన్నారు. దేశం యుద్ధ పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజల దైనందిన జీవితం దెబ్బతినకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పెజెష్కియన్ అన్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, ప్రజల జీవన ప్రమాణాలను కాపాడడం ప్రస్తుతం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇరాన్ వ్యాప్తంగా అమెరికా దాడులు చేస్తోందని, ఆ పరిణామాలను దేశ ప్రజలు అంగీకరించాలని కోరారు. టీవల కొద్ది రోజులుగా అమెరికా-ఇరాన్ మధ్య వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడంతో ప్రపంచ చమురు సరఫరాపై కూడా ప్రభావం పడుతోంది. అయితే యుద్ధ వాతావరణం నెలకొన్నప్పటికీ, ఉద్రిక్తతలను తగ్గించేందుకు పలు దేశాలు దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. కానీ, ఇరు దేశాలు తమ తమ వైఖరిని మార్చుకోకపోవడంతో పరిస్థితి ఇంకా అనిశ్చితంగానే ఉంది.

# అసోంను ముంచెత్తిన వరదలు

### భారీ వర్షాలకు జనజీవనం అతలాకుతలం

### పదిమంది మృతి..లక్షలాది మంది నిరాశ్రయులు

**గౌహతి, అక్షరకలం ప్రతినిధి**

అస్సాంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. భారీ వానల కారణంగా ఇప్పటివరకు 10 మంది మృతిచెందగా, లక్షల మంది నిరాశ్రయులయ్యారు. వర్షాలకు అస్సాం రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల్లో 794 గ్రామాలు ప్రభావితమయ్యాయి. శివసాగర్, చరైడియో, జోర్హాట్, దిబ్రూఘర్, సోనిత్‌పూర్, బిస్వనాథ్, గోలాఘాట్, ధేమాజీ, తిన్‌సుకియా, నాగావ్, కర్బీ అంగ్లాంగ్, కాచర్, ఉదల్‌గురి, చిరాంగ్, కమ్‌రూప్, కమ్‌రూప్ (మెట్రో) జిల్లాలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. ఆయా జిల్లాల్లో మొత్తం 3.62 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సహాయక బృందాలు రంగంలోకి దిగి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. అధికారులు 101 సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. మరోవైపు భారీ వర్షాలతో నదులకు వరదనీరు పోటెత్తుతోంది. నేమతిఘాట్ వద్ద బ్రహ్మపుత్ర, చెనిమారి (ఖోవాంగ్) వద్ద బుర్హిదిహింగ్, నాంగ్లాముర్ఘాట్ వద్ద దిసాంగ్, నుమాలిగఢ్ వద్ద ధన్‌సిరి (దక్షిణ), శివసాగర్ వద్ద దిఖౌ నదులు ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలకు వరదనీరు జనావాసాల్లోకి వచ్చింది. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అనేక రోడ్లు దెబ్బతిన్నాయి. వర్షాలకు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. దాదాపు 19,100 హెక్టార్లలో పంటలు నీట మునిగాయి. మరోవైపు, అస్సాంలోని కొన్ని ప్రాంతాల్లో మరింత వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ మేరకు చెరువులు, నదుల నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అలాగే ప్రమాదకర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు అధికారుల సూచనలను పాటిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచిస్తున్నారు.



# కాక్రోచ్ పార్టీ ఆందోళనపై కేంద్రం అప్రమత్తం

### విద్యార్థులతో చర్చించేందుకు సిద్దమని సంకేతాలు

### లాఠీఛార్జ్‌లో గాయపడ్డ విద్యార్థులను పరామర్శించిన జెపి నడ్డా

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

నీట్ ప్రశ్నపత్రం లీక్, విద్యా వ్యవస్థలో లోపాల నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ సోమవారం చేపట్టిన 'చలో పార్లమెంట్' యాత్ర ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో సీజేపీ ఆందోళనకు శాంతియుత పరిష్కారం చూపే దిశగా కేంద్రం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థి ప్రతినిధులతో చర్చలకు సిద్ధమని కేంద్రం ప్రకటించినట్లు సమాచారం. ఈ సమస్యలకు చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అందుకోసం ఆ దిశగా చర్యలు చేపట్టింది. విద్య మంత్రిత్వ శాఖ లేదా ఉన్నతాధికారుల స్థాయిలో విద్యార్థులతో సమావేశం నిర్వహించే ఆస్కారం ఉందని తెలుస్తోంది. దీంతో నీట్ నిర్వహించే పరీక్షా వ్యవస్థలో పారదర్శకతతో పాటు సంస్కరణల దిశగా ముందడుగు పడనుంది. సోమవారం చలో పార్లమెంట్ యాత్రలో విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో గాయపడిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని మంగళవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డా పరామర్శించారు. అనంతరం విద్యార్థులతో కేంద్రం చర్చలకు సుముఖంగా ఉందనే ప్రచారం ప్రారంభమైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్, పోటీ పరీక్షల్లో అవకతవకలతో పాటు పేపర్ లీకేజీ వ్యవహారంపై విద్యార్థి లోకం భగ్గుమంది. దీంతో జాతీయ స్థాయిలో విద్యార్థుల నిరసనలు, నిరాహార దీక్షలు ఉధృతమయ్యాయి. దాంతో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి 'చర్చల కోసం తలుపులు తెరిచే ఉన్నాయని' కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మరో వైపు ఈ అంశంపై ప్రధాని మోదీకి విద్యావేత్తలతో పాటు సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఒంకోవైపు నీట్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని మోదీ తొలిసారి స్పందించారు. మంగళవారం న్యూఢిల్లీలో మంగళ్ మిలన్ పేరిట ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ ఘోర పాపమని అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. ఈ పేపర్ లీకులను నివారించడం జాతీయ బాధ్యత అని ప్రధాని మోదీ తెలిపారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో సీజేపీ ప్రతినిధులు సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమ 3 ప్రధాన డిమాండ్లతో కూడిన లేఖను కేంద్రమంత్రికి వారు అందజేసిన విషయం విదితమే. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తన ఎక్స్ వేదికగా వివరించిన సంగతి తెలిసిందే.

# హైకోర్టులో హైడ్రా కమిషనర్‌కు చేదు అనుభవం

### గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని సెక్యూరిటీ సూచన

### రంగనాథ్ వ్యవహార శైలిపై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో చేదు అనుభవం ఎదురైంది. వీఐపీలు ప్రవేశించే గేట్ నంబర్ 6 నుంచి కాకుండా, సామాన్య ప్రజలు ప్రవేశించే గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని రంగనాథ్‌కు సెక్యూరిటీ సిబ్బంది సూచించారు. దీంతో గేట్ నంబర్ 4 వద్ద సామాన్య ప్రజలు వాహనాలు పార్క్ చేసే స్థలంలో కారు పార్క్ చేసి, అక్కడి నుండి నడుచుకుంటూ కోర్టులోకి వెళ్లారు. కాగా, ప్రైవేట్ ఆస్తి వివాదంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారశైలిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఒకే అంశానికి సంబంధించి ఏకంగా మూడు కోర్టు ధికరణ పిటిషన్లు దాఖలవడం అత్యంత తీవ్రమైన విషయమని వ్యాఖ్యానించింది. కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించడం వెనుక కారణమేమిటని నిలదీసింది. ప్రైవేటు ఆస్తిలో జోక్యం చేసుకోవద్దని స్పష్టమైన ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాటిని లెకచేయకుండా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన అలవాటుగా మారిందా? కోర్టు ధికరణనే పరిపాటిగా మార్చుకున్నారా? అంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకటి కాదు, రెండు కాదు, ఒకే అంశంపై మూడు కోర్టు ధికరణ పిటిషన్లు దాఖలవుతున్నాయంటే కోర్టు ఉత్తర్వుల పట్ల ఎంత నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారో స్పష్టమవుతున్న దని ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టుల పట్ల ఎంత గౌరవం ఉన్నదో ఈ పరిణామాలే చెప్తున్నాయని పేరొంది. ఇకడ బాధితుడు పిటిషనర్ కాదని, స్వయంగా కోర్టేనని ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టు ఉత్తర్వులను ధికరించడం ఎంతమాత్రం సహించబోమని రంగనాథ్‌కు తేల్చిచెప్పింది. ప్రభుత్వమైనా, ప్రభుత్వాధికారులైనా చట్టానికి అతీతులు కాదని స్పష్టం చేసింది. నీటి వనరులు, నాలాలు, కాలువల పరిరక్షణ పేరుతో కోర్టు ఉత్తర్వులను పకనపెట్టి ప్రైవేటు భూముల్లోకి వెళ్లడం ఏ చట్టం ప్రకారం సమర్థనీ యమని ప్రశ్నించింది. యజమాని అనుమతి లేకుండా ప్రైవేటు భూమిలో అడుగు పెట్టరాదన్న ప్రాథమిక సూత్రం తెలియదా అని నిలదీసింది. ప్రభుత్వ భూమిని రక్షించడమే లక్ష్యమైతే ప్రైవేటు వ్యక్తిపై పోలీసు ఫిర్యాదు ఎందుకు చేశారని ప్రశ్నించింది.

# పార్లమెంట్లో ప్రతిపక్ష నేతలకు సమాధానం ఇవ్వరా

### కేంద్ర ప్రభుత్వం తీరుపై మండిపడ్డ ఎంపి చామల

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

పార్లమెంటులో ప్రతిపక్ష నేతలు అడిగిన అంశాలకు కేంద్రం ఎందుకు సమాధానం చెప్పట్లేదని కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీజేపీ పార్టీ మద్దతుదారు, కార్యకర్తలను కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఎంపీలు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల మాట్లాడారు. ర్యాలీ సందర్భంగా సీజేపీ కార్యకర్తలపై ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జ్ చేశారని అన్నారు. ఈ ఘటనలో పలువురు సీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయని వెల్లడించారు. ఆర్‌ఎంఎల్ ఆస్పత్రిలో సీజేపీ కార్యకర్తలను రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో కలిసి పరామర్శించినట్లు ఎంపీ చామల చెప్పుకొచ్చారు. విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసిన ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌తో ఎందుకు రాజీనామా చేయించట్లేదని ఎంపీ చామల నిలదీశారు. ప్రధాని మోదీని మూడోసారి ప్రజలు ఎన్నుకున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను మోదీ పరిష్కరించే దిశగా ఎందుకు ముందుకు పోవట్లేదని నిలదీశారు. రైతులు హరియాణాలో ఆందోళన చేస్తున్నారని, వారిని ఎందుకు అడ్డుకుంటున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.

# కిసాన్ ఘాట్ వద్ద నిరసనకు వేలాదిగా రైతుల రాక

### పోలీసుల కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

### హర్యానా-పంజాబ్ శంభు సరిహద్దు వద్ద ఉద్రిక్తత

**న్యూఢిల్లీ,**

హర్యానా-పంజాబ్ సరిహద్దులోని శంభు బార్డర్ వద్ద హైటెన్షన్ నెలకొంది. మహాపంచాయత్‌లో పాల్గొనేందుకు పంజాబ్, హర్యానా నుంచి ఢిల్లీ వైపుగా వేలాది మంది రైతులు బయలుదేరారు. ఢిల్లీలోని కిసాన్ ఘాట్ వద్ద నిరసన తెలిపేందుకు అన్నదాతలు వస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతిపాదిత భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంలో భాగంగా తక్కువ ధరకు, సబ్సిడీతో కూడిన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్లను తెరవడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు నిరసనకు దిగుతున్నారు. అయితే, వారిని అడ్డుకునేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఢిల్లీలోని కిసాన్ ఘాట్ వద్ద మహాపంచాయత్‌కు 'దేశ్ బచావో మోర్చా' పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా సుమారు 550 రైతు సంఘాలు, సామాజిక సంస్థలు ఇందులో పాల్గొననున్నాయి. అయితే, నేడు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ఢిల్లీకి బయలుదేరుతున్నట్లు ప్రకటించింది. దీంతో శంభు సరిహద్దును పోలీసులు మూసివేశారు. రైతులను అడ్డుకునేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ అన్నదాతలను నిలువరించేందుకు చర్యలు చేపట్టారు. బారికేడ్లు, ఇనుప కంచెలను ఏర్పాటు చేశారు. సందర్భంగా కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ పంజాబ్ నాయకుడు జర్మన్‌జిత్ సింగ్ బండాలా మాట్లాడారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం భారతీయ రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు, విస్తృత ప్రజానీకంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. భారతదేశంలోని చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలను విస్మరిస్తూ అమెరికన్ కంపెనీలు, రైతులకు ప్రయోజనం చేకూర్చడమే ఈ ఒప్పందం లక్ష్యమని బండాలా ఆరోపించారు. నేడు పంజాబ్ రైతులతో పాటు హర్యానా, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల నుంచి నిరసనలో పాల్గొనేందుకు అన్నదాతలు వస్తున్నారని తెలిపారు. ఒకవేళ తాము ఢిల్లీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకుంటే అక్కడే శాంతియుత సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నిరసన ఆరంభం మాత్రమేనని, ఒప్పందాన్ని కేంద్రం రద్దు చేయకపోయినా, తమ డిమాండ్లను పరిష్కరించకపోయినా ఆందోళనను తీవ్రతరం చేస్తామని బండాలా హెచ్చరించారు.

# సిక్కింలో ఘోర విషాదం

### నిర్మాణంలో ఉన్న సొరంగంపై విరిగిపడ్డ కొండచరియలు

### పదిమంది కార్మికుల దుర్మరణం

**గ్యాంగ్‌టక్,**

సిక్కింలో ఘోర విషాదం చోటుచేసుకుంది. దక్షిణ సిక్కింలోని సమర్‌దుంగ్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సొరంగం వద్ద కొండచరియలు విరిగిపడటంతో ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇప్పటివరకు పదిమంది మృతిచెందారు. వారి మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు వెల్లడించారు. మరో 20 మందికిపైగా కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను నామ్చి జిల్లా కలెక్టర్ అనుప తమ్లింగ్ వెల్లడించారు. సోమవారం తీస్తా స్టేజ్-జలవిద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన సొరంగంలో ఈ ప్రమాదం జరిగింది.

# చీర్లవంచ గ్రామంలో డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా వైద్య ఆరోగ్య అధికారి

**రాజన్న సిరిసిల్ల : అక్షర కలం**



చీర్లవంచ గ్రామంలో నిర్వహించిన డ్రై డే (మంగళవారం) కార్యక్రమాలను జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నివాస ప్రాంతాలు, నీరు నిల్వ ఉండే ప్రదేశాలు, ఇంటింటి పరిసరాలను తనిఖీ చేసి, దోమల నివారణ చర్యలను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రతి మంగళవారం, శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే నిర్వహించాలని క్షేత్ర స్థాయి సిబ్బంది కి సూచించారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీటి నిల్వ పాత్రలను వారానికి ఒకసారి పూర్తిగా ఖాళీ చేసి శుభ్రం చేయాలని, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, కూలర్లు, పూల కుండీలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, దోమల లార్వా నిర్మూలన కొరకు నీరు నిల్వ వుండే ప్రదేశాల్లో ఆయిల్ బాల్ ను వినియోగించాలని దోమల నివారణకు పాసింగ్ చర్యలను మరింత సమర్థవంతంగా చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. గ్రామ ప్రజలు కూడా ఆరోగ్య శాఖతో కలిసి డ్రై డే కార్యక్రమాలను విజయవంతం చేయాలని డీఎండహెచ్‌వో పిలుపునిచ్చారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణాపురం రైల్వే గేట్‌కు మోక్షం.. ఆర్వోబి నిర్మాణంపై ముందడుగు

**– ఎంపీ వద్దిరాజు చొరవకు దక్కిన ఫలితం**

**అక్షర కలం/ ఉమ్మడి ఖమ్మం బ్యూరో:**



చింతకాని మండలం రామకృష్ణాపురం సమీపంలోని 107 రైల్వే గేట్ వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి ఎట్టకేలకు అడుగు ముందుకు పడింది. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చొరవ ఫలితంగా ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది. దానికి తోడు గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు చేసిన విజ్ఞప్తులు, వివిధ పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చిన కథనాలకు స్పందన లభించింది. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ బాబ్జి ప్రసాద్ ఆధ్వర్యంలో రైల్వే రోడ్ సేఫ్టీ అధికారి సుందర్ సేన్, ఇతర అధికారులతో కలిసి రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆర్వోబి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ అంశం.. గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆమోదం తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ గాదె నాగలక్ష్మి, ఉపసర్పంచ్ గాదె రామారావు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే రోడ్ సేఫ్టీ అధికారి సుందర్ సేన్ మాట్లాడుతూ.. ఆర్ఓబీ నిర్మాణానికి అవసరమైన ప్రక్రియలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. నిర్మాణం కోసం భూములు కోల్పోయే రైతులు పూర్తి సహకారం అందించాలని కోరారు. భూమి కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందజేస్తామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. త్వరలోనే సర్వే పనులు ప్రారంభించి నిర్మాణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. గ్రామంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరిస్తే ఆర్ఓబీ నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**ఎంపీ వద్దిరాజు కృషి..**

రామకృష్ణాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం గ్రామస్తులంతా ఏడాది క్రితం ఎంపీ వద్దిరాజు రవిచంద్రను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు రవిచంద్ర స్పందించి ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ సందర్భంగా రామకృష్ణాపురం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ఆవశ్యకత గురించి మంత్రికి వివరించారు. ఆ మేరకు కొద్ది రోజులకే రైల్వే మంత్రి స్పందించి ఎంపీ రవిచంద్ర కు లేఖ రాశారు. బ్రిడ్జి నిర్మాణ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, దీనిపై తొందరలో సముచిత నిర్ణయం తీసుకుంటామని హామీ ఇస్తూ మంత్రి అశ్విని వైష్ణవ్ హామీ ఇచ్చారు. ఆ మేరకు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రిత్వ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రామకృష్ణాపురం గ్రామస్తులు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు కృతజ్ఞతలు తెలిపారు.

# రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలి

**రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 21:**

జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయం నుండి అదనపు కార్యదర్శి ఇలంబర్తి, శాంతి భద్రతల అధికారులు, రవాణా, రహదారి భవనాలు, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, రవాణా, రహదారులు భవనాల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం జాతీయ రహదారులపై ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని, జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాలు ప్రతినెల నిర్వహించాలని తెలిపారు. టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, బ్లాక్ స్పాట్ లను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని అంబులెన్స్ లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలోని జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రహదారి భద్రత కమిటీ సమావేశాలు నిర్వహించి భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నామని, రహదారిపై ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి ఎ భాస్కర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలి... జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్

**రోడ్డు భద్రతపై రవాణ శాఖ కమీషనర్ ఇల్లంబర్తి నిర్వహించిన వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్**

**అక్షర కలం/ ఖమ్మం ఉమ్మడి బ్యూరో:**



ఖమ్మం జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి జాతీయ రహదారులపై రోడ్డు భద్రతా ప్రమాణాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర రవాణ శాఖ కమీషనర్ ఇల్లంబర్తి హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జాతీయ రహదారులపై రోడ్డు భద్రత చర్యలు, ప్రమాదాల నివారణ, సుప్రీం కోర్టు మార్గదర్శకాల అమలు, అనుసరణ (కంప్లయన్స్) నివేదికల సమర్పణ, ప్రమాదాల తగ్గింపునకు తీసుకోవాల్సిన చర్యలు, జాతీయ రహదారుల వెంట ఉన్న ఆసుపత్రుల మ్యాపింగ్, ఆక్రమణల తొలగింపు, అత్యవసర స్పందన వ్యవస్థ, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఖమ్మం పోలీస్ కమీషనరేట్ కార్యాలయం నుండి సిపి సునీల్ దత్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను ఇప్పటికే గుర్తించినవి, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, క్రిటికల్ జంక్షన్లలో అవసరమైన రోడ్డు భద్రతా పనులను తక్షణమే చేపట్టాలని సూచించారు. జిల్లా పరిధిలోని జాతీయ రహదారుల వెంట వాహనాల కోసం అవసరమైన పార్కింగ్ ప్రాంతాలు, ప్రతి 40 నుంచి 50 కిలోమీటర్ల కు ఒకసారి ప్రజలకుఅవసరమైన పార్కింగ్, మరుగుదొడ్లు, ఇతర వే సైడ్ సదుపాయాల వివరాలతో కూడిన అనుసరణ నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి ట్రాఫిక్ ఉల్లంఘనను నమోదు చేసి నిబంధనల ప్రకారం జరిమానాలు విధించే వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులో ఉంచి, జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించాలని, అంబులెన్స్ సేవలు కూడా దానికి అనుసంధానమై ఉంచాలని తెలిపారు. జాతీయ రహదారు లకు సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల మ్యాపింగ్ పూర్తిస్థాయిలో ఉండాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని, జాతీయ రహదారులకు అక్రమంగా ప్రవేశ మార్గాలు కల్పిస్తున్న దాబాలు, వాణిజ్య సంస్థలు, ఇతర నిర్మాణాలను కేంద్ర జాతీయ రహదారుల చట్టం ప్రకారం తొలగించాలని సూచించారు. జాతీయ రహదారుల సేఫ్టీ జోన్ పరిధిలో ఎలాంటి వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్లను శాశ్వతంగా సరిదిద్దేందుకు అందుబాటులో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని కలెక్టర్ సూచించారు. బ్లాక్‌స్పాట్ల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని వెంటనే సిద్ధం చేసి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌హెచ్ఏఐ, రోడ్లు-భవనాల శాఖ అధికారులు ఏటీఎంలు (అడ్వాన్స్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సిస్టమ్), ఆక్రమణలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ ప్లాన్, లే-బైలు (ఘుఎ-ఎఎవం), వే సైడ్ అమెనిటీస్, బ్లాక్‌స్పాట్లు, తదితర అంశాలపై చేపట్టిన చర్యలకు సంబంధించిన సమగ్ర అనుసరణ నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు.

# ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ ఆధ్వర్యంలో "మొక్కలు నాటుదాం... నీటిని రక్షించుదాం" అంటూ పట్టణంలో అవగాహన ర్యాలీ.

**అక్షర కలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి:-**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు "క్యాచ్ ది రైన్ -- వానను ఒడిసిపట్టండి"అనే కార్యక్రమంలో భాగంగా పట్టణంలో అవగాహన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధులు పాల్గొని "వానను ఒడిసిపట్టండి, నీటిని సంరక్షించండి, మొక్కలు నాటండి ప్రకృతిని కాపాడండి ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మిద్దాం" వంటి నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు పచ్చని ప్రకృతితో పాటు సమృద్ధిగా నీటి వనరులు అందించాలంటే మొక్కల పెంపకం, వర్షపు నీటి సంరక్షణను ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతల ద్వారా ఏర్పాటుచేయాలని ఈ బాధ్యతను ప్రతి కుటుంబ సభ్యులు ఉద్యమంగా చేపట్టాలని భవిష్యత్ తరాలకు పచ్చని ప్రకృతిని అందించాలని, ప్రతి కుటుంబం ఆరోగ్యంవంతంగా ఉండాలంటే పచ్చని చెట్లతోపాటు ఇంటి పరిసరాలలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని తద్వారా భూ జలాలను ఓడిసి పట్టుకోవడం జరుగుతుందని వర్షాకాలంలో వచ్చే వర్షపు నీటిని మన ఇంటి చుట్టూ పల్లపు ప్రాంతంలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రతి కుటుంబం పై ఉందన్నారు. పచ్చని చెట్లను నాటాలని, ఇంకుడు గుంతలను పట్టణంలోని ప్రతి వార్డులోని కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణమిత్ర డానియల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ నీలపు రమేష్ , 19వ వార్డు కౌన్సిలర్ పింగళి అనూహ్య , 3వ వార్డు కౌన్సిలర్ అజ్మీరా వంశీ నాయక్ , 24వ వార్డు కౌన్సిలర్ సిహెచ్ శృతి రమేష్ , ఇల్లందు మున్సిపల్ కమిషనర్ ఎస్. సందీప్, మున్సిపల్ ఏఈ నవీన్ , మున్సిపల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. నినాద మొక్కలు నాటుదాం.

# నా జీవితం ఆయుర్వేద విస్తరణకే అంకితం...

**ఆశీస్సులు అందించిన డాక్టర్ ఏల్చూరి వెంకటరావు,భూస్తంబన విద్యాధికులు డాక్టర్ విశ్వనాథం.**

**నాటి ఏజెన్సీ ప్రాంతంలో పేదలకు ఆయుర్వేద సేవలు అందించిన తమ పూర్వీకుల స్ఫూర్తి..**


**మధుర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు వీరాభిమాని జీ వి ఎం సి శర్మ .**

**అక్షర కలం/పినపాక.**

మన చుట్టూర కనిపించే, ప్రకృతి అందాలు వెదజల్లే చెట్లు, వృక్షాలు, ప్రతి ఒక్కటి మానవ జీవనానికి ఆరోగ్యపరంగా ఉపయోగపడే వనమూలికలే,అందుకే అందరికీ తెలిసేట్టు ఆయుర్వేద మందులు అందాలి, అందరూ నమ్మాలి అనే నినాదంతో తనకు జన్మనిచ్చిన తండ్రి గోళ్ళమూడి లక్ష్మీ కాంతారావు ఆశ యాలతో తనకు తెలిసిన చెట్ల వన మూలికలతో వివిధ రకాల జబ్బుల రోగులకు ఆయుర్వేద వైద్య చికిత్సలు చేస్తూ,తద్వారా ఆరోగ్య వంతులవుతున్న ప్రతి ఒక్కరి నుంచి సన్మానాలు, సత్కారాలు అభినంద నలు పొందుతున్న, ఆయు ర్వేద బ్రహ్మ గోళ్లమూడి వెంకట మధుసూ దన శర్మ (జివిఎంసి శర్మ).వెంకట మధుసూదన శర్మ కుటుంబం మొత్తం ఆయుర్వేద సేవలతో పాటు దేశభక్తి లో కూడా పేరు, ప్రఖ్యాతులు గడించారు.అదే విధంగా తన తండ్రి గోళ్ళమూడి వెంకట లక్ష్మీ కాంతా రావు, ఆయుర్వేద గురువర్యులు మహర్షి పండిత ఏల్చూరి వెంకట్రావు మరియు గురుదేవులు తణుకు భగవాన్ వేల్పూరు మౌన రమణ స్వామి దివ్య శుభాశీస్సులతో గత ఉమ్మడి రాష్ట్రాలైనటువంటి ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలలో వేలాదిగా ఉచిత ఆయు ర్వేద వైద్య శిబిరాలు నిర్వహించి వేలాది మందికి వైద్య చికిత్సలు అందించారు శర్మ.ఆయుర్వేద వైద్య విధానాల గురించి రెండు రాష్ట్రాలలో వేలాదిగా శిక్షణ శిబిరాలు నిర్వ హించిన ఘనత జీవీఎంసీ శర్మకి దక్కింది.చెట్ల వన మూలికల వైద్య చికిత్సల గురించి క్రీస్తుపూర్వం కనుగొన్న మహా ఋషు ల విగ్రహాలను సైతం రెండు రాష్ట్రా లలో ప్రతిష్టింప చేయడానికి కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి శర్మ అని చెప్పక తప్పదు.డాక్టర్ పండిత మహర్షి ఏల్చూరి వెంకట్రావు,తో కలిసి వేలాది గా వైద్య శిబిరాల సదస్సులు నిర్వహించారు.2016 సంవత్సరంలో ఇండియన్ నేషనల్ సైన్స్ కాంగ్రెస్, మైసూర్ యూనివర్సిటీలో ఉత్తమ అవార్డులుతీసుకున్నారు.ఆయుర్వేద వైద్యం గురించి కూడా ప్రత్యేక శిబిరా లు నిర్వహించారు.అదేవిధంగామాస పత్రిక అయిన టువంటి అందరికీ ఆయుర్వేదం పుస్తకంలో పలు జబ్బు లకు విరుగుడుగా చెట్ల వనమూలి కలతో నయమయ్యే చిట్కాలను ప్రచురించిన పుస్తకాలు ప్రజలందరికీ అదే విధంగా ప్రచారం కోసం నిర్వి రామ కృషి చేశారు మధుసూదన శర్మ.తన తండ్రి లక్ష్మీకాంతారావు గత రజాకారుల నిజాం పాలనలో పాల్వంచ జాగీ ర్దార్ సంస్థానంలో తహసీల్దారుగా పనిచేశారు.అదే సమయంలో ప్రస్తుత పినపాక నియో జకవర్గం లోని కరకగూడెం సమీపం లోని చిరుమళ్ళ గ్రామం వద్ద 281/18 సర్వే నంబర్ లోని 999,30 ఎకరాల భూమిని గాంధీ స్మారక పాఠశాల భూమి కింద 1949 సంవత్సరంలో రెవెన్యూ రికార్డులు నమోదు చేయించి విరాళంగా ఇచ్చారు లక్ష్మీ కాంతారావు.అందు లో పాఠశాలను ఏర్పాటు చేసి,విద్యా ర్థులకు ఉచిత విద్య అందించడంతో పాటు, అందులో గిరిజన



ప్రజలు, గిరిజనేతర ప్రజల కోసం లక్ష్మీ కాంతా రావు మెమోరియల్ హాస్పిటల్ నిర్మించి పది పైసల నామమాత్రపు ఫీజు తీసుకొని వైద్యం అందించారు. అలాగే గాంధీజీ సిద్ధాంతాలను అనుసరిస్తూ నూలు వస్త్రాల వడకడం వంటి కార్యక్రమాలు నిర్వహించే వారు.జివిఎంసి శర్మ వృద్ధాప్యంలోకి వస్తున్నప్పటికీ తన జీవితాన్ని ఆయుర్వేద వైద్య విస్తరణకే అంకితం అంటూ చెబుతున్నా రు. పండిత ఏల్చూరి వెంకట్రావు సహచరులు డాక్టర్ విశ్వనాథం బూస్తమ విద్యలో ప్రావీణ్యులు, గత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్గా కుముద్ బెన్ జోషి ఉన్న సమయంలో భూస్తంబన విద్య అంటే ఒక మనిషిని గొయ్యి తీసి అందులో పెట్టి పైన చెక్కలు పెట్టీ చుట్టూర లోనికి గాలి వెళ్లకుండా మట్టి ముద్ద లతో రుద్దేయడం జరుగు తుంది,ఆ తర్వా త 24 గంటల అనంతరం తిరిగి గొయ్యి నుండి మనిషిని ప్రాణంతో పైకి తీసుకు వచ్చే విద్యను వీక్షించిన ప్రజలందరూ ఆశ్చర్యం వ్యక్తం చేసేవారు.శర్మకు నీలకంఠే శ్వరుడు అంటే చాలా ఇష్టమైన దేవుడు, భద్రాద్రి జిల్లాలోని మణుగూ రు మండలం కు చెందిన స్వయంభు నీలకంఠేశ్వర స్వామి ఆలయ నిర్మా ణంలో అలాగే ఖమ్మం జిల్లా కుంచ పర్తి శివాలయ నిర్మాణం సమయంలో తను శాయశక్తుల సేవలు చేసి అదృష్టం ఆ దేవుడు కల్పించాడని సంతోషాన్ని వ్యక్తం చేశారు.మధుసూ దనా శర్మ అల్లుడు మాతృభూమి ఫౌండేషన్ అధినేత కాటూరు కిరణ్ ఆదేశాల మేరకు ఖమ్మం లోని ఎస్ ఆర్ ఎన్ బి కాలేజీ ఆవరణలో భారతమాత చిత్రపటాన్ని ఆవిష్క రించారు.అదేవిధంగా పలు జిల్లా లలో కూడా భరతమాత చిత్రప టాలను నెలకొల్పినట్లు తెలిపా రు.భరత మాత ఫౌండేషన్ అధినేత కటూరు కిరణ్ పేద విద్యార్థు లకు ఉచిత విద్యను అందిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు.వెంకట మధుసూధన శర్మ, ప్రస్తుతం ఖమ్మం లోని నివాసా న్ని హైదరాబాద్ లో ఏర్పరుచుకొని అక్కడే ఉంటూ ప్రతి పౌర్ణమి రోజున పశ్చిమగోదావరి జిల్లా తణుకు, వేలు పూరు ప్రాంతంలోని రమణా శ్రమంలో మౌన స్వామి వారి సేవలు చేస్తూ అంకితమవతానని తెలిపారు.అదే విధంగా ప్రజలకు ఆయు ర్వేద వైద్య చికిత్సలు అంది స్తున్నారు శర్మ.ఏజె న్సీ ప్రాంతంలో ఆయుర్వేద సేవ లు పూర్వీకుల స్ఫూర్తితో దశాబ్దాలుగా ప్రజలకు ప్రకృతి వైద్యాన్ని అందిస్తూ విశేష సేలు'చేస్తున్నారు.యుక్త వయ స్సు నుంచే ఆయుర్వేద వైద్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దేశవ్యా ప్తంగా సుమారు మూడు వేల ప్రదర్శనలు,అవగాహన సదస్సులు నిర్వ హించారు.శర్మ ప్రకృతి వైద్యం ద్వారా బ్రెయిన్ ట్యూమర్,థైరా యిడ్, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సలో విశేష అనువాన్ని సంపాదించి అనేక మంది రోగులకు సేవలు అందిస్తు న్నారు.ఆయుర్వేదంలో,వాక్చాతుర్యంలో దిట్ట జీవీఎంసీ శర్మ.అంతేకాదు గాయకు లు పౌరాణిక రంగస్థలం కళాకారు లు.మధుర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు వీరాభి మాని శర్మ. ఘంటసాల పాడిన పాటలు,పద్యా లు అన్న ముఖ్యంగా భగవ ద్గీత పారాయణ శ్లోకాలు చాలా ఇష్టం.శర్మ ఘంటసాల పాటలు,పద్యాలు శ్లోకాలు పాడుతా ఉంటే చుట్టు పక్కల వారు ఎంతో ఆనందింప చేసేవారు.అలాంటి గొప్ప కళ అతనిలో ఉంది.శర్మ ఒకరోజు కనిపించకపోతే తన అభిమానులు, స్థానికులు ఆయన కోసం నిరీక్షించని వారు అంటూ ఉండరు.ఆయుర్వేద వైద్య చికిత్సలు అందించడంలో ఆయనకు ఆయనే సాటి,ఇలాంటి బహుముక ప్రజ్ఞశాలి వృద్ధాప్యం దరి చేరుతున్నప్పటికీని,ఉత్సాహంతో పదిమందిని ఆనందింపజేస్తున్న గోళ్ళమూడి వెంకట మధుసూదన శర్మ ఆయురారో గ్యాలతో ఉండాలని కోరుకుందాం....



అక్షర కలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# ప్రజాగొంతుకపై అంకుశం !

**దేశంలో ఆందోళనలను పట్టించుకునేందుకు పాలకులకు తీరిక లేకుండా పోయింది. కేంద్రంలోని ప్రభుత్వమైనా, రాష్ట్రాల్లోని వివిధ పార్టీల నేతృత్వంలో ఉన్న ప్రభుత్వాలకైనా ఇది కనపడడం లేదు. అన్నా హజారే లాంటి వారు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే స్థితిలతో పాలకులు లేరు. రాజకీయ అవినీతిపై ఆయన యుద్ధం చేస్తున్నా, ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. తాజాగా సామాజిక కార్యకర్త, విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఇరవైరోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ఆమరణ దీక్షలో ఉన్నారు. ఆయన ఎందుకు దీక్ష చేస్తున్నారు..ఎందుకు నిరసనలకు దిగారన్న కనీస ఆలోచన కూడా చేసే పరిస్థితిలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం లేదు. ఎన్‌డిఎకు మద్దతు ఇస్తున్న పార్టీలు కూడా కిమ్మనడం లేదు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహారించడం ప్రజాస్వామ్యంలో పనికిరాదు. మొత్తంగా పోటీ పరీక్షల విశ్వసనీయత దెబ్బతినివున్న పరిస్థితుల్లో ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్న సంస్కరణలపై మాట్లాడటా నికీ, తగిన చర్యలు చేపట్టడానికీ ప్రభుత్వానికి అభ్యంతరం ఉండనక్కరలేదు. ప్రజల పక్షాన నిరశనలు, ఉద్యమాలు చేయడం వాంగ్‌చుక్‌కు కొత్తకాదు. రేపోమాపో ఆయన దీక్ష విరమించినా ఎవరూ దానిని వైఫల్యంగా భావించరు.**

కానీ, నెలన్నరనుంచి సాగుతున్న ఈ ఉద్యమాన్ని బేఖాతరు చేయడం ప్రభుత్వానికి అప్రదిష్ఠతెస్తుంది, మానవత్వం, జవాబుదారీతనం కొరవడ్డాయన్న అభిప్రాయానికి తావిస్తుంది. శాంతియు తంగా సాగుతున్న నిరసనను అలాగే ముగిసేట్టు చూడాల్సిన బాధ్యత ఇరుపక్షాలపైనా ఉంది. కొందరు నిస్వార్థ పరులు దేశం కోసం ఏదో చేయాలన్న తపనలో ఉంటారు. వారు తమ ఆకాంక్షను నిరసలన ద్వారా తెలియచేస్తారు. వాటిని గుర్తించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అలా జరగడం లేదు. తాజాగా సోనమ్ వాంగ్ చుక్ దీక్ష ఈ కోవలోకే వస్తుంది. నీట్ తప్పిదాలకు బాధ్యత వహిస్తూ కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో వాంగ్‌చురక్ దీక్షకు దిగారు. నిజానికి సోనమ్ ను పిలిచి మాట్లాడవచ్చు. లూఏదా ఆయన దీక్షను విరమించేలా, ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించ వచ్చు. కానీ ప్రభుత్వం అలా చేయకుండా యాన దీక్ష భగ్నానికి యత్నించింది. అంటే దీక్షలను కూడా తట్టుకునే స్థితిలో పాలకులు లేరని గుర్తించాలి. 1984లో లద్దాఖ్ వాసులకు ఎస్టీ హోదా ఇవ్వాలంటూ వాంగ్‌చుక్ తండ్రి వాంగ్యాల్ ఇలాగే దీక్షకు దిగితే నాటి ప్రధాని ఇందిరాగాంధీ స్వయంగా లెహ్ వెళ్ళి, డిమాండ్లు నెరవేరుస్తానని హామీ ఇచ్చి దీక్ష విరమింపచేసిన విషయం మరచిపోరాదు. 2011లో సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే దీక్ష సందర్భంలోనూ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ మానవతా దృక్పథంతో వ్యవహరించారు. అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ చర్చించడం ద్వారా పెద్దమనసు చాటుకున్నారు. వాంగ్‌చుక్ ఈ దీక్షకు దిగడానికి బీజేపీమీద ఆయనకు ఉన్న పాతకక్షలే కారణమంటూ కొన్ని హిందీ చానెళ్ళలోనూ, సోషల్ మీడియాలోనూ బురదజల్లే పని జోరుగా సాగడం దారుణం కాక మరోటి కాదు. ఆయన ఆరోగ్యం తీవ్రంగా క్షీణించిందని, పదికేజీలకు పైగా బరువు తగ్గారని, దీక్షసాగితే కీలక



అవయవాల పై దుష్ప్రభావాలు తప్పవని వైద్యబృందం హెచ్చరించడంతో పోలీసులు ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. నిజానికి ఈ పనిచేసే ముందు వాంగ్‌చుక్‌తో మాట్లాడివుంటే పాలక పార్టీ పెద్దల గౌరవం తగ్గేది ఏమీ లేదు.. ఆయన ప్రాణానికి ప్రమాదం ఉన్నది కనుక, దీక్ష విరమింపచేయా లంటూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేస్తూ, ప్రతీ పౌరుడి ప్రాణమూ విలువైనదేనని, వాంగ్‌చుక్‌కు ప్రభుత్వ వైద్యులతో నిరంతర పరీక్షలు నిర్వహిస్తూ, వైద్యపరమైన చర్యలన్నీ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. ఆయనతోపాటుగా ఆమరణదీక్షలో ఉన్న ముగ్గురు విద్యార్థినేతల ఆరోగ్యం బాగా దిగజారిందని, తక్షణమే దీక్షవిరమించాల్సిందిగా ఒకరిని వైద్యులు హెచ్చరించినట్టుగా వార్తలు వస్తున్నాయి. వాంగ్‌చుక్ మాత్రం తాను బయటకు బలహీనంగా కనిపిస్తున్నా, లోన గట్టిగానే ఉన్నానని హామీ ఇస్తున్నారు. తనను దీక్ష విరమించుకోవాలని ఒత్తిడి చేయవద్దని ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని వాంగ్‌చుక్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా, పార్లమెంట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభిం అయినా, ఎన్‌డిఎ పక్షనేతలు ఎవ్వరు కూడా వాంగ్‌చుక్‌ను పలకరించలేదు. ఆయన పక్షాన నిలవడానికి వారికి ధైర్యం లేకుండాపోయింది. దీక్షాస్థలిని సందర్శించి మద్దతు ప్రకటిస్తున్న ప్రముఖులు, నేతలు లేకపోలేదు. కొందరు స్వయంగా వచ్చి సంఘీభావం ప్రకటిస్తే, బీజేపీ ప్రభుత్వ కఠినవైఖరిని పలు వేదికలద్వారా మరికొందరు ప్రశ్నిస్తున్నారు. నీట్ వైఫల్యం మీద స్వయంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూ, ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ, కాస్తంత ఆలస్యంగానైనా వాంగ్‌చుక్ పక్షాన మాట్లాడుతోంది. ఇకపోతే లద్దాఖ్‌కు రాష్ట్రహోదా, ఆరో షెడ్యూల్ రక్షణల కోసం గత ఏడాది వాంగ్‌చుక్ సుదీర్ఘపోరాటం చేసినప్పుడు కూడా ప్రభుత్వం ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. పైగా, హింసను ప్రేరేపించారన్న ఆరోపణలతో, ఆయన మీద జాతీయ భద్రతాచట్టాన్ని ప్రయోగించి, జైల్లో పడేశారు. 170 రోజులు జైల్లో ఉన్నాక, సుప్రీంకోర్టులో కేసు చివరివిడత విచారణకు రెండురోజుల ముందు ప్రభుత్వం ఆయనను విడుదలచేసింది. దానితోపాటు, ఆయనను అరెస్టుచేయడానికి ప్రాతిపదికలుగా వాడిన పాకిస్థాన్‌తో సంబంధాలు, అనుమానస్పద విదేశీపర్యటనలు, అక్రమ విరాళాల సేకరణ ఇత్యాది ఆరోపణలను కూడా గాలికి వదిలేసింది. ఓ రకంగా ప్రజల గొంతుకపై పాలకులు అంకుశం దింపుతున్నారు. తాముకోరుకున్నట్లుగా పాలన సాగిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించడం లేదు. ఇందుకు తాజా ఘటనలే నిదర్శనం.

# రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం అవుతుంది

## మరో 10 సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలి

## సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్

**అక్షర కలం సిద్ధిపేట జూలై 21:**

బిఆరెస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోలేదు కానీ ఇప్పుడు రైతుల పట్ల ఎమ్మెల్యే హరీశ్ రావు బిఆరెస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నరు అని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్అన్నారు. సిద్ధిపేటలో సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ గారు మాట్లాడుతూ 20 వేల కోట్ల రూపాయలతో పూర్తి అయ్యే ప్రాజెక్టును లక్ష కోట్ల రూపాయల అంచనాకు పెంచి కెసిఆర్ కుటుంబం కేటీఆర్ హరీశ్ రావు కవిత ప్రజల సొమ్మును దోచుకున్నారు అని అన్నారు. ప్రజలకు లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టు కట్టిస్తున్నాం అని చెప్పి కూలిపోయే ప్రాజెక్టు కట్టిన ఘనత కెసిఆర్ కుటుంబానికి దక్కింది.అని అన్నారు. బిఆరెస్ పార్టీ నాయకులు వచ్చే ఎన్నికల్లో అధికారం లోకి రావడం కోసం ప్రజలను రైతులను రెచ్చగొడుతున్నది అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిఆరెస్ పార్టీ కనుమరుగు అవడం ఖాయం అని అన్నారు. ప్రజలు బిఆరెస్ పార్టీని ఎక్కడ మరిచిపోతారు అని తమ ఉనికి కాపాడుకునేందుకు నీచమైన




రాజకీయాలు చేస్తున్నారు అని అన్నారు. రైతులను మోసం చేయాలని నీరు విడుదల చేయాలి అని రైతులను అడ్డం పెట్టుకుని రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నారు అని అన్నారు. ప్రాజెక్టు నుండి నీరు విడుదల చేస్తే కాళేశ్వరం ప్రాజెక్టుకు మరింత నష్టం జరుగుతుంది అని నిపుణులు చెబుతున్నారు అని అన్నారు. రైతులకు నీరు ఎప్పడు అందించాలో ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలుసు అని అన్నారు. అధికారంలోకి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ చేయడం లేదని బిఆరెస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు.అని అన్నారు. ప్రాజెక్టు రిపేర్ కోసం 10 సంవత్సరాలలో మీరు దోచుకున్న సొమ్మును ప్రభుత్వానికి ఇవ్వండి అని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర మీది అని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులను నట్టేట ముంచి పాదయాత్ర చేయడం సిగ్గుచేటు అని అన్నారు. అధికారం పోగానే బిఆరెస్ నాయకులకు రైతులు గుర్తువచ్చారా అని ప్రశ్నించారు. మీరు చేసే దొంగ డ్రామాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు అని తెలుసుకోవాలి అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ది రైతు సంక్షేమ ప్రభుత్వం అని తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారు.అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం అభివృద్ధిని చూసి బిఆరెస్ పార్టీ నాయకులు ఓర్వడం లేదు అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ ఉన్న నాయకుడు అని ఆయన నాయకత్వంలో అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు అని అన్నారు. రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర బిఆరెస్ ది అయితే రైతులకు 2 లక్షల రూపాయలు రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ ది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుంది అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం అవుతుంది అని మరో 10 సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్నిప్రజలుఆశీర్వదించాలి అని అన్నారు. మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే బిఆరెస్ పార్టీ నాయకుల తాట తీస్తాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలిముద్దీన్, మార్కా సతీష్, దాస అంజయ్య, వహాబ్, గయాసుద్దీన్ ,బంక చిరంజీవి, విజయ డైనల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై విద్యాశాఖ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాము. యు స్ ఫ్ ఐ సిద్దిపేట జిల్లా కమిటీ

**అక్షర కలం సిద్ధిపేట జూలై 21:**

తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఫీజుల దోపిడి పై స్పందించి ఈనెల 30వ తేదీ లోపు ఆడిట్ రిపోర్టులు మరియు ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులో ఉంచాలని తీసుకున్న నిర్ణయాన్ని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) సిద్ధిపేటజిల్లాకమిటీస్వాగతిస్తున్నట్లు పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి గుడికందుల రవి మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై యజమాన్యాలు అక్రమ పద్ధతిలో వసూలు చేసే డబ్బులపై మా సంఘం ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించామని, ఆ నిర్ణయాలకు తగ్గట్టుగా రాష్ట్ర ప్రభుత్వం మరియు విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకోవడం సరైందని వారు అన్నారు. ఈ నిర్ణయాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు.రాజకీయాలకు అతీతంగా ఈ నిర్ణయాన్ని కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా ఆచరణలో తమిళనాడు ప్రభుత్వం లాగా పని చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై ఎలాంటి పక్షపాతధోరణిలేకుండావ్యవహారించాలనిఅన్నారు.అదేవిధంగాజూనియర్ కళాశాలల ఫీజుల దోపిడీపై మరియు తప్పుడు ర్యాంకులపై ప్రచారం చేస్తున్న కళాశాలల యజమాన్యాలపై కేసులు నమోదు చేయాలని అన్నారు. నీట్ రిజల్ట్ లో రాష్ట్రంలో రానీ తప్పుడు రిజల్ట్ కూడా శ్రీ చైతన్య, నారాయణ కార్పొరేట్ విద్యాసంస్థల యజమాన్యం ప్రచారం చేస్తుందని దీనిపై ఇంటర్ బోర్డు వ్యవస్థకూడాస్పందించాలనికోరారు.లేనిపక్షంలో దశలవారి ఆందోళనకార్యక్రమాలుచేపడతామనిహెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పుట్ల హేమంత్ జిల్లా నాయకులు లడ్డూ,సాయిరాం తదితరులు పాల్గొన్నారు.




# అధిక రుసుము వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు....

**- ఈ - డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్.....**

మెదక్/ కొల్చారం జూలై 21(అక్షర కలం):-
మెదక్ జిల్లా పరిది లోని పలు మీసేవ కేంద్రాలను ఈ - డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్ ఆకస్మిక తనిఖీ చేశారు. కొత్తగా వచ్చిన ఎస్ ఎస్ సి మేమో ప్రింట్, యూరియా బుకింగ్, ఫార్మర్ రిజిస్ట్రేషన్ మరియు వ్యవసాయేతర మార్కెట్ విలువ సర్వీసుల గురించి మీసేవ నిర్వాహకులకు వివరించారు. ఏ విధమైన టెక్నికల్ సమస్యలు వచ్చిన అతి త్వరగా క్లియర్ చేస్తామని ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ప్రతి అప్లికేషన్ నమోదు చేయాలని తెలిపారు.కులం, ఆదాయం, నివాసం, జనన , మరణ కుటుంబ ధృవీకరణ పత్రం, నేటివిటి, గ్యాప్ , నాన్ క్రిమీ లేయర్ వంటి సర్టిఫికేట్లు ఎన్ని సార్లు అయినా తీసుకునే వెసులుబాటు కలదని ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్ తెలిపారు మీసేవ కేంద్రాలను ప్రజలకు ఇప్పుడు అందుబాటులో ఉండి ఈ ఎస్ డి గైడ్లైన్స్ ప్రకారం మీ సేవ కేంద్రాన్ని నడపవలనని సూచించారు. ఆపరేటర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అన్ని రకాల మీసేవ, భూభారతి మరియు మిగతా ఆన్లైన్ సర్వీస్ లను ప్రజలకు అందించాలని సూచించారు.మీసేవ సెంటర్లో తప్పకుండా సిటిజెన్ చాప్టర్, భూభారతి కి సంబంధించిన



ఫ్లెక్సీలు, మీసేవ లోగో, మరియు తాసిల్దార్, ఈడీఎం, పరిష్కారం కాల్ సెంటర్ల యొక్క ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా ఉండవలెనని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆదేశించారు. కళ్యాణ లక్ష్మి, యు డి ఐ డి (సదరం), బర్త్ మరియు డెత్ సర్టిఫికెట్లు ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని మరియు మీసేవ ఆపరేటర్లు ప్రజల పట్ల సున్నితంగా ఉంటూ వారికి మీసేవ సర్వీసులను మరియు ఇతర అన్ని రకాల ఆన్లైన్ సేవలను అందించాలని ఆదేశించారు. నిర్ణీత రుసుము కంటే ఎక్కువ రుసుము దరఖాస్తుదారుడు నుంచి తీసుకున్నట్లయితే తప్పనిసరిగా అట్టి మీసేవ సెంటర్ పై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ తెలిపారు.అదేవిదంగా రాష్ట్రంలో పౌర సేవలను పారదర్శకంగా వేగవంతంగా అందించేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. గ్రామ పాలనాధికారులు మరియు రెవిన్యూ ఇన్స్పెక్టర్లు వినియోగించుకునే విధంగా ప్రత్యేక మొబైల్ అనువర్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇకపై పౌర సేవల దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, రెవెన్యూ సిబ్బంది నివేదికల సమర్పణ తదితర ప్రక్రియ మొత్తం ఆన్లైన్ విధానంలోనే కొనసాగుతుంది . అని తెలిపారు కాగిత రహిత విధానం అమలులోకి రావడంతో సమయానికి సేవలు అందడం, పారదర్శకత పెరగడం జరుగుతుందని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ తెలిపారు. ప్రస్తుతం ఆదాయం,కులం, నివాసం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, లేట్ రిజిస్ట్రేషన్ బర్త్ మరియు డెత్, అగ్రికల్చరల్ మార్కెట్ వాల్యూ , గ్యాప్ సర్టిఫికెట్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మీసేవ ద్వారా అప్లై చేస్తే దరఖాస్తు తొలుత గ్రామ రెవెన్యూ పాలనాధికారి(జీపీవో)కి లాగిన్‌లోకి వస్తుంది. ఆయన విచారణ తర్వాత మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఎంఆర్ఐ)కి, తదనంతరం ఆర్ఐ నేరుగా తహసీల్దార్ లాగిన్‌కి చేరవేరుస్తారని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ తెలిపారు.అలాగే కొత్త విధానం ప్రకారం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే దరఖాస్తుదారుడికి రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్ కు ఒక ఎస్ఎంఎస్ వస్తుంది. అందులో అప్లికేషన్ నెంబర్ సర్వీసు పేరు చెల్లించిన ఫీజు వివరాలతో పాటు ఒక హైపర్ లింక్ ఉంటుంది. పౌరులు ఆ లింకు పై క్లిక్ చేసి తమ రసీదును ఎప్పుడైనా వీక్షించవచ్చు డౌన్లోడ్ చేసుకోవచ్చు లేదా ప్రింట్ తీసుకోవచ్చు సర్టిఫికెట్ చేతికి వచ్చేవరకు ఈ ఎస్ఎంఎస్ ను సురక్షితంగా ఉంచుకోవాలని ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సూచించారు. దీనివల్ల కాగితాలు పోగొట్టుకునే భయం ఉండదు అలాగే మీసేవ అప్లికేషన్లో సదరు మెసేజ్ తిరిగి పంపించే సౌకర్యాన్ని కల్పించారని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మీసేవ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# సమష్టిగా నిలబడి ఎల్-నినోను ఎదుర్కొందాం

**అక్షర కలం రంగారెడ్డి**


రైతులు, ప్రజల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం -- అన్ని శాఖలు మిషన్ మోడ్‌లో పనిచేయాలి - అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, రైతులు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో మిషన్ మోడ్‌లో పని చేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులను ఆదేశించారు.మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమీక్షా సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, సంభావ్య వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి శాఖ ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి, కంటింజెన్సీ ప్లాన్‌లను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం, అవసరమైన విత్తనాల సరఫరా, తాగునీటి ఏర్పాట్లు, పశువులకు మేత, ఉపాధి హామీ పనులు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సేవలు వంటి అంశాల్లో ఎలాంటి లోటు



లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.
వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పెసర, కంది, జొన్న, రాగులు వంటి పంటలను ప్రోత్సహించాలని, రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను వెంటనే అందుబాటులో ఉంచాలని సూచించారు. పశువులకు పశు గ్రాసం కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా జల వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని తెలిపారు. అవసరమైన చోట కొత్త బోర్లు తవ్వించడం, తాగునీటి బోర్లకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించడం, స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాకపోయినా, ముందస్తు ప్రణాళికలు మరియు సమన్వయంతో వాటి ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని స్పీకర్ పేర్కొన్నారు. ఎల్-నినో ప్రభావంతో ఏర్పడే అనావృష్టి పరిస్థితుల నుంచి ప్రజలను రక్షించడం జిల్లా యంత్రాంగం బాధ్యత అని, అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలు, ఉద్యాన పంటలు, పండ్ల తోటలు, పూల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. మండల స్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ప్రాంతాల్లో వరి సాగు అధికంగా ఉండటంతో, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులకు తగిన సూచనలు అందించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. తాగునీటి కొరత తలెత్తకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేయాలని, గ్రామాలు, పట్టణాల్లో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట



# నీలో గొప్ప ట్యాలెంట్ ఉంది

### గుర్నూర్ బ్రార్ పై ఫ్యాన్స్ కామెంట్స్

ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా ఎట్టకేలకు విజయాన్ని అందుకుంది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో చిత్తు చిత్తుగా ఓడిన భారత జట్టు.. తొలి వన్డేలో మాత్రం ఘనవిజయాన్ని అందుకుంది. సీనియర్లు రావడంతో జట్టు బలంగా తయారైంది. మొదట బౌలర్లు ప్రతాపం చూపిస్తే.. ఆ తర్వాత బ్యాటర్లు రెచ్చిపోయారు. ఫలితంగా భారత జట్టు 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు విఫలం అయ్యారు. కోహ్లీ కేవలం 5 పరుగులు చేసి అవుటైతే.. రోహిత్ శర్మ 11 పరుగులు మాత్రమే చేశాడు. అయితే గిల్ (80 రిటైర్డ్ హర్ట్) జట్టుకు విజయాన్ని ఖాయం చేశాడు. అయితే ఈ మ్యాచ్‌లో భారత్ గెలవడానికి ముఖ్య కారణం బౌలర్లు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఆరంభంలో మంచి ప్రదర్శన చేసింది. ముఖ్యంగా బెన్ డకెట్ (43) అద్భుతంగా ఆడాడు. తొలి వికెట్‌కు బెతెల్ (14)తో కలిసి 61 పరుగులు జోడించారు. ఈ దశలో ఇంగ్లండ్ 300కు పైగా పరుగులు చేస్తుందని అంతా అనుకున్నారు. అయితే ఇక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. కొత్త బౌలర్ గుర్నార్ బ్రార్ టీమిండియాకు బ్రేక్ ఇచ్చాడు. బంతిని అందుకున్న అతడు 3 బంతుల వ్యవధిలో 2 వికెట్లు తీశాడు. 13వ ఓవర్ వేసిన బ్రార్.. మొదట జాకబ్ బెతెల్‌ను అవుట్ చేశాడు. అనంతరం డేంజరస్ ప్లేయర్ బెన్ డకెట్‌ను అవుట్ చేశాడు. దాంతో ఇంగ్లండ్ 2 పరుగుల తేడాతో రెండు వికెట్లను కోల్పోయింది. ఇక ఇక్కడి నుంచి భారత జట్టు పుంజుకుంది. ఆ వెంటనే మరో డేంజరస్ ప్లేయర్ హ్యారీ బ్రూక్‌ను బుమ్రా అవుట్ చేశాడు. అంతే ఇంగ్లండ్ వెంటవెంటనే 3 వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత కూడా ఇంగ్లండ్ క్రమం తప్పకుండా వికట్లను కోల్పోయింది. ఒక దశలో 61 పరుగులకు వికెట్ లేకుండా ఉన్న ఇంగ్లండ్.. 46 పరుగుల తేడాతో 6 వికెట్లను కోల్పోయింది.గుర్నూర్ బ్రార్ 9 ఓవర్లలో 2 వికెట్లు తీశాడు. అయితే మ్యాచ్ మధ్యలో కాస్త అతి కూడా చేశాడు. బెన్ డకెట్ నేరుగా కొట్టిన షాట్‌ను అడ్డుకున్న బ్రార్.. బంతిని డకెట్ వైపు విసిరాడు. ఆ తర్వాత బంతిని డకెట్ సిక్సర్ బాదాడు. సోషల్ మీడియాలో.. ఇలాంటి అతి పనులు చేయకు బ్రార్.. నీలో గొప్ప ట్యాలెంట్ ఉందంటూ ఫ్యాన్స్ కామెంట్స్ పెడుతున్నారు.

# భారత తుది జట్టులో మార్పులు

### తుది జట్టులోకి కేఎల్ రాహుల్

మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఆదివారం మూడో వన్డే జరగనుంది. తొలి వన్డేలో భారత్ గెలిస్తే.. రెండో వన్డేలో ఇంగ్లండ్ నెగ్గింది. దాంతో సిరీస్ విజేత మూడో వన్డేలో తేలనుంది. క్రికెట్ మక్కాగా పిలిచే లార్డ్స్‌లో ఈ పోరు జరగనుంది. , ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌కు ముందు భారత తుది జట్టులో మార్పులు జరిగే అవకాశం ఉంది. రెండో వన్డేకు దూరమైన కేఎల్ రాహుల్ మూడో వన్డే కోసం తుది జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. అనారోగ్యం కారణంగా అతడు రెండో వన్డేకు దూరమయ్యాడు. అతడు ఫిట్‌గా ఉంటే మాత్రం మూడో వన్డే ఆడటం పక్కా. అదే జరిగితే ఇషాన్ కిషన్ పక్కకు తప్పుకోవాల్సిందే. ఇక మరో మార్పు కూడా జరగనుంది. రెండో వన్డే మ్యాచ్ ఆడుతున్న సమయంలో వాషింగ్టన్ సుందర్ తొడ కండరాల గాయానికి గురయ్యాడు. గాయం తీవ్రత దృష్ట్యా అతను మూడో వన్డేలో ఆడే అవకాశాలు లేవు. అతడి స్థానంలో హర్ష్ దూబే తుది జట్టులో ఆడతాడని బీసీసీఐ అధికారికంగా తెలిపింది. రెండో వన్డేలో వాషింగ్టన్ సుందర్ కూడా ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఈ విషయాన్ని గిల్ పరోక్షంగా ప్రస్తావించాడు. ఇక ప్రిన్స్ యాదవ్‌ను ఆడించాలనుకుంటే మాత్రం ప్రసిధ్ కృష్ణ తప్పుకోవాల్సి ఉంటుంది. అయితే అది జరుగుతుందా లేదా అనేది చూడాల్సి ఉంది. ఇక మరోవైపు రోహిత్ శర్మపై కూడా చాలా వార్తలే నడుస్తున్నాయి. చివరి వన్డే అంటూ కొందరు.. అబ్బే అదేం లేదంటూ బీసీసీఐ ఖండించడం చకచకా జరిగిపోయాయి. ఇప్పటికే రోహిత్ శర్మ పేరెంట్స్ లండన్ చేరుకున్నారని సమాచారం. ఏదో జరుగుతుందని లేకపోతే పేరెంట్స్ ఎందుకు వెళ్తారంటూ సరికొత్త ప్రచారం మొదలైంది.




# ఫుట్‌బాల్ చరిత్రలో కొత్త అధ్యాయం

ఫిఫా అధికారిక ప్రకటన ప్రకారం, జులై 19న న్యూయార్క్-న్యూజెర్సీ స్టేడియంలో జరిగే స్పెయిన్ జం అర్జెంటీనా ఫైనల్ విజేత జట్టు సభ్యులు బెస్పోక్ (కస్టమ్) చాంపియన్‌షిప్ రింగ్స్‌ను అందుకోనున్నారు. ఇవి ఫిఫా పోటీల్లో ఇప్పటివరకూ ఎప్పుడూ ఇవ్వని మొదటి రింగ్స్. రింగ్ ఒక వైపు ఫిఫా వరల్డ్ కప్ ట్రోఫీనీ, మరో వైపు విజేత జట్టు గుర్తింపును ప్రతిబింబించేలా డిజైన్ చేశారు. బంగారు రంగులో, నీలి సఫైర్స్, డైమండ్స్‌తో అలంకరించిన ఈ రింగ్స్ అత్యంత ఆకర్షణీయంగా ఉన్నాయి. మొత్తం 2,026 లిమిటెడ్ ఎడిషన్ రింగ్స్ తయారుచేశారు. వీటిలో 30 రింగ్స్.. విజేత జట్టు సభ్యుల (ప్లేయర్స్, స్టాఫ్) కోసం రిజర్వ్ చేశారు. మిగిలిన సుమారు 1,996 రింగ్స్ ప్రపంచవ్యాప్తంగా ఫ్యాన్స్ కోసం అమ్మబోతున్నారు. ఇప్పటి వరకు అధికారిక ధర ప్రకటించలేదు. ఒక్కో రింగ్ సుమారు వి25,000 (సుమారు ?21 లక్షలు) ఉండవచ్చని అంచనా ఉంది. బంగారు, డైమండ్స్, సఫైర్స్‌తో తయారైన లగ్జరీ రింగ్ కాబట్టి ధర ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ప్రతి రింగ్ ఇండివిడ్యువల్‌గా నంబర్ చేసినది. ఇది టోర్నమెంట్‌ను స్మరించుకోవడానికి ఒక ప్రత్యేక సంకేతం. ఫిఫా ఈ చర్యను అమెరికన్ స్పోర్ట్స్‌లోని చాంపియన్‌షిప్ రింగ్స్ సంప్రదాయం నుంచి ప్రేరణ పొంది ప్రవేశపెట్టింది. ఈ అప్‌డేట్ ఫుట్‌బాల్ ప్రపంచాన్ని కదిలించింది. కొందరు ఫ్యాన్స్ దీనిని స్వాగతించగా, మరికొందరు ఫుట్‌బాల్‌కు అమెరికన్ ఇన్‌ఫ్లుయెన్స్ అని విమర్శించారు. అయినప్పటికీ, విజేతలు.. ట్రోఫీ, గోల్డ్ మెడల్స్‌తో పాటు ఈ రింగ్స్‌ను కూడా అందుకోవడం చరిత్రాత్మకం అవుతుంది. రింగ్ డిజైన్‌లో ఫిఫా వరల్డ్ కప్ లోగో, తద్వారా ఈ రింగ్ ప్రత్యేకమైనదిగా గుర్తింపు పొందుతుంది. ఈ ప్రకటన ఫిఫా ఆర్గనైజేషన్ ద్వారా జూలై 16-17న వెలువడింది. ఈ టోర్నమెంట్.. హోస్ట్ దేశాలైన కెనడా, మెక్సికో, ఖూూలో జరుగుతోంది. ఫైనల్‌లో స్పెయిన్ (యూరో చాంపియన్స్), అర్జెంటీనా (డిఫెండింగ్ చాంపియన్స్) మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. ఈ రింగ్స్ విజేతల గౌరవాన్ని మరింత పెంచుతాయని ఫిఫా తెలిపింది. ఫ్యాన్స్ ఈ రింగ్స్‌ను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇవి కలెక్టర్స్ ఐటెమ్‌గా మారవచ్చు. ఫిఫా ఈ కొత్త ట్రెండ్‌తో వరల్డ్ కప్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాలని భావిస్తోంది. మొత్తంగా, ఇది ఫుట్‌బాల్‌లో ఆధునికీకరణకు ఉదాహరణ.



అక్షరకలం
తెలుగు దినపత్రిక




## సినిమా
CINEMA



# ఇన్‌స్టాలో దుమ్మురేపిన ఫౌజీ

ఫస్ట్‌లుక్ విడుదల కాగానే 5.33 లక్షల లైక్స్ రెబల్ స్టార్ ప్రభాస్ సినిమా అంటే థియేటర్లలో మాత్రమే కాదు, సోషల్ మీడియాలోనూ అభిమానుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో మరోసారి నిరూపితమైంది. తాజాగా విడుదలైన ఫౌజీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును నమోదు చేసి, భారతీయ సినీ ప్రమోషన్లకు కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. తాజా గణాంకాల ప్రకారం, 'ఫౌజీ' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తొలి 24 గంటల్లోనే ఏకంగా 5.33 లక్షల షేర్లు సాధించింది.





# రామ్‌చరణ్-సుకుమార్ కాంబో

ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న రాంచరణ్ మరోమారు సుకుమార్‌తో సినిమాకు సిద్ధం అవుతున్నారు. వీరి కాంబో రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్-రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు.

# ప్రయాంకచోప్రా బర్త్‌డే

మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న చిత్రం 'వారణాసి'లో మహేశ్‌కు జోడీగా బాలీవుడ్ నటి ప్రియాంక కనిపించనున్న విషయం తెలిసిందే. మందాకిని పాత్రలో ఆమె సందడి చేయనున్నారు. శనివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా సినిమా సెట్‌లోని ఫొటోలను విడుదల చేస్తూ రాజమౌళి పోస్ట్ పెట్టారు. 'ఆమె నవ్వితే అందం.. నవ్వకపోతే నిప్పు కణిక' అనే క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేశ్ కూడా ప్రియాంకకు విషెస్ చెప్పారు. 'మా ఒకే ఒక్క మందాకినికి హ్యాపీ బర్త్‌డే..' అని పోస్ట్ పెట్టారు. ప్రియాంక 'వారణాసి' కోసం 14 నెలల నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇందులో అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేసినట్లు ఆమె చెప్పారు. ఇక ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రపంచంతో పాటు కాలాల్ని చుట్టేసే సాహసికుడి కథగా ఇది ముస్తాబవుతున్నట్లు తెలిసిందే. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ ఏడాది అక్టోబర్ నాటికి చిత్రీకరణ పూర్తి చేసి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ప్రియాంక చోప్రా ఫొటోస్ రిలీజ్ నేపథ్యంలో సోషల్ మీడియాలో మరోసారి ఆసక్తికర ప్రచారం మొదలైంది. చేస్తున్నాయి. 'బాబు బర్త్‌డేకు భారీ సర్‌ప్రైజ్', 'బాబు బర్త్‌డేకు గ్లింప్స్ లోడింగ్'. 'ఆగస్టు 9న ఇంతకుముందెన్నడూ చూడని హైప్ చూడబోతున్నారు'

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# నా కూతురిని నాకు అప్పగించండి.....

- కారేపల్లి పోలీసులు పట్టించుకోవడం లేదు....
- న్యాయం చేయాలని వేడుకున్న తల్లి గుగులోత్ సుజాత






**అక్షర కలం/ ఉమ్మడి ఖమ్మం బ్యూరో :**

మే 31 నుండి తన కూతురు కనిపించడం లేదని, పోలీసులకు పిర్యాదు చేసినా ఇంతవరకూ ఆచూకీ తెలుసుకోలేదని, వెంటనే న్యాయం చేయాలని తల్లి గుగులోత్ సుజాత వేడుకుంది. ఖమ్మం లోని ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.... గతంలో ఒక సారి బాణోత్ ముఖేష్ అనే యువకుడు తన పాపను తీసుకెళ్తే వెతుకులాడి తీసుకొచ్చామని తెలిపింది. మళ్ళీ తన పాపకు మాయ మాటలు చెప్పి తీసుకెళ్లాడని, ఇంతవరకూ ఆచూకీ లేదని పేర్కొంది. ముఖేష్ మాత్రం ఉరిలోనే ఉన్నాడని, మేము ఎక్కడ వెతికినా పాప ఆచూకీ తెలియడం లేదని, ఈ విషయంపై కారేపల్లి పోలీసుకులకు పిర్యాదు చేశామని తెలిపింది. పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నామని, పట్టించుకోవడం లేదని తెలిపింది. పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని పాప ను తమకప్పగించాలని వేడుకుంది. ఈ సమావేశంలో బాణోత్ మల్సూర్, బాణోత్ సరోజ పాల్గొన్నారు.

# ఆరెగూడెంలో సీసీ కెమెరాల ప్రారంభం, మొక్కలు నాటే కార్యక్రమం ఘనం





**అక్షర కలం, చౌటుప్పల్**

చౌటుప్పల్ మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవం, మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు ఎస్పీ, చౌటుప్పల్ డీఎస్పీల ఆదేశాల మేరకు చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ కుమార్, ఆరెగూడెం గ్రామ సర్పంచ్ ఎన్నపల్లి ధనలక్ష్మి వెంకట్ రెడ్డిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మన్మధ కుమార్, సర్పంచ్ ధనలక్ష్మి మాట్లాడుతూ... నేరాల నివారణలో, నేరస్తులను త్వరితగతిన గుర్తించడంలో మరియు ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణలో సీసీ కెమెరాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. భద్రత దృష్ట్యా ప్రతి గ్రామం, కాలనీ, వ్యాపార సంస్థలు మరియు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు

**?పర్యావరణ పరిరక్షణకు హరితహారం**

?అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామంలో 'హరితహారం' కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు మెంబర్లు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి....

**మెదక్ /కొల్చారం జూలై 21( అక్షరకలం):-**

మంగళవారం రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు మరియు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అన్ని జిల్లాలలో వేగవంతంగా పూర్తి చేసి, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలంలోగా పూర్తి చేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అనర్హుల పేర్ల తొలగింపు, ఓటరు వివరాల




సవరణ వంటి ప్రక్రియలను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరించాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ దరఖాస్తులను స్వీకరించి త్వరితగతిన ఆన్లైన్ పూర్తి చేయాలని తెలిపారు. అందిన ఫారాలు, దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాల వారీగా పురోగతిని ప్రతిరోజూ సమీక్షిస్తూ, పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలనితెలిపారు.

# రైతుల చిరకాల కల సాకారం

## --ధర్మారెడ్డిపల్లి కాలువలో సాగునీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే కుంభం

**అక్షరకలం బిబినగర్**

భువనగిరి నియోజకవర్గ రైతాంగం చిరకాలంగా ఎదురుచూస్తున్న శుభ ఘడియ ఆవిష్కృతమైంది. వలిగొండ మండలంలోని సంగెం-ధర్మారెడ్డిపల్లి కాలువలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం, భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి కలిసి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కాలువ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు మాట్లాడుతూ, దాదాపు రూ.125 కోట్ల వ్యయంతో చేపట్టిన ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 16 నెలల్లోనే సగానికి పైగా పూర్తి చేసి, రైతులకు సాగునీటిని అందించే స్థాయికి తీసుకువచ్చిందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టుకు





తమ ప్రభుత్వం వేగం తీసుకొచ్చి రైతుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిందని అన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో పూర్తి చేసి, రైతులకు శాశ్వతంగా సాగునీటిని అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాలువ పూర్తయిన అనంతరం వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో వ్యవసాయ ఉత్పత్తి పెరగడమే కాకుండా రైతుల ఆర్థికాభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ధర్మారెడ్డిపల్లి కాలువలో నీటి విడుదలతో ఈ ప్రాంత రైతుల చిరకాల నిరీక్షణకు తెరపడిందని, కాలువ పూర్తయిన తర్వాత ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, రైతులు, ఇరిగేషన్ ఈఈ డిఈ పాల్గొన్నారు.

# జాతీయ రహదారులపై ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

## స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలను నివారించడమే ప్రధాన లక్ష్యమని రవాణా, రోడ్డు భవనాల శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, పోలీస్, జాతీయ రహదారుల శాఖ ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం జాతీయ రహదారుల వెంట భారీ వాహనాలు, ట్రక్కులు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయవద్దని, కేవలం నిర్దేశించిన స్థలాల్లోనే నిలపాలని ఆదేశించారు. రోడ్డు ఆక్రమణలను తక్షణమే తొలగించాలని పేర్కొన్నారు. కలెక్టర్లు, పోలీసులు, జాతీయ రహదారుల అధికారులతో కలిసి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్, రవాణా శాఖ పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం జాతీయ రహదారులపై తనిఖీలు చేపట్టాలని, ఆ వాహనాల్లో అత్యవసర






వైద్య సేవల సామాగ్రి అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తమ పరిధిలోని ఆసుపత్రులు, ట్రామా కేర్ సెంటర్ల వివరాలను మ్యాపింగ్ చేయాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి, వాటి పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ బి. చంద్రశేఖర్

?స్పెషల్ సీఎస్ ఆదేశాలపై స్పందిస్తూ, రోడ్డు భద్రతా నిబంధనలను జిల్లాలో పక్కాగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ రహదారుల వెంట గుర్తించిన బ్లాక్ స్పాట్స్ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పరిశీలించి, భవిష్యత్ ప్రణాళికలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ?ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ శరత్ చంద్ర పవార్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, జిల్లా రవాణా అధికారి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియలో వేగం పెంచాలి

## రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) డిజిటలైజేషన్ ప్రక్రియలో వేగం పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ మీద రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో





సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో వెనుకబడి ఉన్న జిల్లాలలో ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. జిల్లాల వారిగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రగతి వివరాలు సమీక్షించారు. వారంలోగా అన్ని జిల్లాల ఎస్ఐఆర్ ప్రక్రియ 90 శాతానికి చేరుకోవాలని, వీలైనంత త్వరగా ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని చెప్పారు. ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారములో ఆధార్ నంబరు నమోదు చేయడం కేవలం ఐచ్ఛిక మాత్రమే అని, తప్పనిసరి కాదని వివరించారు. కలెక్టర్లంతా ప్రక్రియ పూర్తయ్యే వరకు పర్యవేక్షణ ఉంచాలని చెప్పారు. ఈవీడియోకాన్ఫరెన్సలో కలెక్టర్ బి చంద్రశేఖర్ అదనపు కలెక్టర్ రెవెన్యూ. జె శ్రీనివాస్ జిల్లా రెవెన్యూ అధికారి దశరథ ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన బియ్యంలో పురుగులు

## సర్పంచ్ ఫిర్యాదుతో అధికారుల తక్షణ స్పందన

## గంటలోపే బియ్యం మార్పిడికి ఆదేశాలు

**అక్షర కలం సిద్దిపేట జూలై 21:**

సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం తిమ్మాయి పల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కింద సరఫరా చేసిన బియ్యంలో పురుగులు కనిపించడం మంగళవారం కలకలం రేపింది. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో బియ్యాన్ని పరిశీలించిన పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు పురుగులు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని సర్పంచ్ చేర్యాల రాజుకు తెలియజేశారు.



విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో గ్రామ సర్పంచ్ చేర్యాల రాజు వెంటనే స్పందించారు. విద్యార్థుల ఆరోగ్యంతో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నంగునూరు తహశీల్దార్ ప్రవీణ్ రెడ్డితో పాటు పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు అత్యవసరంగా చర్యలు చేపట్టారు. ఫిర్యాదు అందుకున్న నంగునూరు తహశీల్దార్ ప్రవీణ్ రెడ్డి, గిర్దావర్(రెవెన్యూ ఇనస్పెక్టర్-ఆర్ఐ) పయ్యావుల లింగం తక్షణమే పాఠశాలను సందర్శించారు. బియ్యాన్ని పరిశీలించారు. అనంతరం పౌర సరఫరాల శాఖ అధికారులతో మాట్లాడి పురుగులు పట్టిన బియ్యాన్ని వెంటనే వెనక్కి తీసుకెళ్లి, గంట వ్యవధిలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల కింద విద్యార్థులకు సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే స్పందించిన అధికారులను గ్రామస్తులు అభినందించారు. సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి తక్షణ పరిష్కారానికి కృషి చేసిన సర్పంచ్ చేర్యాల రాజును గ్రామ ప్రజలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చేర్యాల రాజు, ఉప సర్పంచ్ కలకుంట్ల యాదగిరి, మాజీ సర్పంచ్ ఏల లత-కృష్ణ, మాజీ ఎంపీటీసీ కలకుంట్ల నర్సింలు, పిల్లి యాదగిరి, పాల్గొన్నారు.

# ఘనంగా బోనాల పండుగ ఉత్సవాలు --- మరికల్‌లో భారీ ఊరేగింపు

**నారాయణపేట (జూలై 21) --- అక్షరకలం జిల్లా ప్రతినిధి:**

నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో మంగళవారం బోనాల పండుగ భవ్యతగా జరపబడింది. గ్రామంలోని శ్రీశ్రీశ్రీ గజ్జలమ్మ దేవాలయం నుంచి పెద్ద బోనం ఊరేగింపుగా ఎరుగుదలై, బొంత సతీష్ కుటుంబం మరియు గ్రామస్తుల ఆధ్వర్యంలో పలు వార్డులలో భారీ ఊరేగింపులు నిర్వహించారు. మరికల్ మండల ఎస్సై విక్రమ్‌ను బొంత సతీష్, బొంత వెంకట్ వారు శాలువాలతో స్వాగతించగా, ఊరేగింపులో పోతురాజుల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బ్యాండ్ బాజాలతో ఉత్సవం ఘనంగా సాగింది. ఈ కార్యక్రమంలో బొంత రామచంద్రయ్య, బొంత సతీష్, బొంత రఘు, బి. కృష్ణ, రాజేష్, జంగిడి శ్రీనివాసులు, పి. శ్రీనివాసులు, నర్సింలు, వెంకటయ్య సహా మరికల్ గ్రామస్తులు---మహిళలు, యువకులు, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు తక్షణమే విడుదల చేయాలి

## రౌండ్ టేబుల్ సమావేశంలో బిఆర్ఎస్, వివిధ సంఘాల డిమాండ్

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**




రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, కాంటెస్టెడ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఏనుగుల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో నల్గొండ పట్టణ కేంద్రంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, విద్యార్థి, కుల, ప్రజా సంఘాల నాయకులు, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు మరియు మేధావులు ఈ సమావేశానికి పెద్దయెత్తున హాజరయ్యారు. ?రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కాపాడటమే లక్ష్యంగా సాగిన ఈ సమావేశంలో పలువురు ముఖ్య నాయకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. గత 30 నెలల పాలనలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలనూ నాశనం చేశారు. స్వయంగా విద్యాశాఖను తన వద్దే ఉంచుకుని, నిధులు ఇవ్వకుండా విద్యా వ్యవస్థను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. ఫీజు రీయింబర్స్మెంట్ వచ్చేదాకా శాసన మండలిలో పోరాడి కాంగ్రెస్ మెడలు వంచుతామని అన్నారు. ?ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ..ఫీజు రీయింబర్స్మెంట్ అనేది కేవలం కళాశాలల సమస్య కాదు, ఇది పేద, బడుగు, బలహీన వర్గాల సామాజిక సమస్య. మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ, ప్రచారాలు, హెలికాప్టర్లకు వందల కోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వం.. విద్యార్థుల చదువులకు బడ్జెట్ లేదనడం దుర్మార్గం. కమిషన్ల రావు కనుక ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు ఆపుతున్నారుని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ నల్గొండ మంత్రి, ఎమ్మెల్యేలు ఒక్కో టూర్ కోసం హెలికాప్టర్లకు రూ.15 లక్షలు ఖర్చు చేస్తున్నారు కానీ, విద్యార్థుల ఫీజులకు నిధుల్లేవా? త్వరలోనే 10 వేల మంది విద్యార్థులు, తల్లిదండ్రులతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వణికించేలా నల్గొండ కేంద్రంగా భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల భవిష్యత్తే ప్రధాన ఎజెండాగా ఉండేది. తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేని రేవంత్ రెడ్డికి ఉద్యమ ఆకాంక్షలు అర్థం కావడం లేదు. తెలంగాణ తల్లిని పేదరాశి పెద్దమ్మలా మారుస్తూ అణగారిన వర్గాలను విద్యకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి నర్సిరెడ్డి మాట్లాడుతూ రూ.3 లక్షల కోట్లకు పైగా బడ్జెట్ ఉన్న తెలంగాణలో రూ.1,100 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడం అత్యంత విచారకరం. ఏ ప్రభుత్వానికైనా విద్య మొదటి ప్రాధాన్యం కానంత వరకు సమాజంలో మార్పు రాదని స్పష్టం చేశారు. ?మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ "కెసిఆర్ హయాంలో గురుకులాలు, జిల్లాకో మెడికల్ కాలేజీతో విద్యా రంగం పురోగమించగా.. ప్రస్తుత ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలలను, విద్యాలయాలను నిర్వీర్యం చేస్తోంది. విద్యా రంగాన్ని కాపాడుకోవడానికి మళ్లీ కెసిఆర్ నాయకత్వమే శరణ్యమని తెలిపారు. ?ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైది రెడ్డి, బీసీ, ప్రజా సంఘాల నాయకులు మిరియాల యాదగిరి, దుందుల లక్ష్మీ నారాయణ, జనార్ధన్ గౌడ్, కోడూరి లక్ష్మీ నారాయణ, రఫీ, పాలడుగుల నాగార్జున, రాకేష్ రెడ్డి పాల్గొన్నారు. ?అలాగే ప్రైవేటు డిగ్రీ, జూనియర్ కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు మారం నాగేందర్, హనుమంతు యాదవ్, మల్లారెడ్డి, రాజేందర్ రెడ్డి, రాపోలు శ్రీజలతో పాటు బిఆర్ఎస్వీ నేతలు నాగార్జున, షోయబ్, రమేష్, వాడపల్లి నవీన్, పురుషోత్తం యాదవ్, స్వరోస్ ప్రతినిధి సురేష్, ఎంఎస్ఎఫ్ నాయకులు సుధీర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, దేవేందర్ రెడ్డి, పిల్లట్ల రవి తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

# ఒక టీవీ ఛానల్ వార్తపై బీఆర్ఎస్ శ్రేణుల మండిపాటు

**పేయిడ్ న్యూస్లతో అసత్య ప్రచారం: యువజన నాయకుడు ముదిగొండ హరిదాస్**

**అక్షరకలం దేవరకొండ**



మాజీ ఎమ్మెల్యే రామావత్ రవీంద్ర కుమార్పై ఓ టీవీ ఛానెల్లో ప్రసారమైన వార్త ముమ్మాటికీ 'పేయిడ్ న్యూస్' అని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ దేవరకొండ యువజన నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో యువజన నాయకుడు ముదిగొండ హరిదాస్ మాట్లాడారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీలో ఉంటూనే కాంగ్రెస్ అభ్యర్థులకు ఆర్థిక సాయం అందించి, సొంత పార్టీ అభ్యర్థుల ఓటమికి కారణమైన వడ్త్యా రమేష్.. ఇప్పుడు పార్టీ నాయకత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్ కోవర్టులుగా వ్యవహరిస్తూ పార్టీలో గందరగోళం సృష్టించడం, కార్యకర్తలను తప్పుదోవ పట్టించడమే ఇలాంటి పేయిడ్ వార్తల వెనుక ఉన్న అసలు కుట్ర అని ఆరోపించారు. పార్టీకి నష్టం చేకూర్చే ఇటువంటి వ్యక్తులపై అధిష్ఠానం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాస్తవాలను పరిశీలించకుండా అసత్య ప్రచారాలకు వేదిక కల్పించడం సరైన జర్నలిజం కాదని ఒక టీవీ ఛానల్ యాజమాన్యానికి హితవు పలికారు. ప్రసార మాధ్యమాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఒక పార్టీ ప్రతిష్టను దెబ్బతీసే కథనాలను ప్రోత్సహించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇలాంటి దుష్ప్రచారాలను వెంటనే నిలిపివేసి, పార్టీ అధిష్ఠానం ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలి. లేకపోతే బీఆర్ఎస్ శ్రేణుల తీవ్ర ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.

# నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరపాలి -నల్లగొండ న్యాయవాదులు



**అక్షరకలం నల్గొండ**

నీట్ ప్రశ్నపత్రాల లీకేజీపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా కోర్టు ప్రధాన ద్వారం ఎదుట న్యాయవాదులు నల్ల బ్యానర్తో నిరసన తెలిపారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఈ సమస్యపై శాంతియుతంగా పార్లమెంట్ ముట్టడికి వెళ్లిన విద్యార్థులు, యువత, తల్లిదండ్రులపై పోలీసులు లాఠీఛార్జ్ చేసి అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ లీకేజీ వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో లేదా స్వతంత్ర సంస్థ ద్వారా నిష్పక్షపాత విచారణ జరిపించాలి. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును అణచివేయడం సరికాదని, అరెస్టు చేసిన విద్యార్థులను నిరభ్యంతరంగా (బేషరతుగా) విడుదల చేయాలి. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత చేస్తున్న న్యాయమైన పోరాటానికి నల్లగొండ న్యాయవాదులు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మల్లేపల్లి ఆదిరెడ్డి, జి. మోహన్, జి. వెంకటేశ్వర్లు, అనంతుల శంకరయ్య, దర్శనం నరసింహతో పాటు కట్టా అనంతరెడ్డి, గుర్రం వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఎల్ వోసి చెక్కు అందజేత

**అక్షరకలం బిబినగర్**



బిబినగర్ మండలంలోని రాయరావుపేట గ్రామానికి చెందిన రొంపి రాములు మంగళవారం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి 2 లక్షల 50వేల ఎల్ వోసి చెక్కును అందజేశారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాములు కుటుంబానికి గత 15 రోజుల క్రితం రెండు లక్షల 50వేల ఎల్ఓసి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే తిరిగి మరో రెండు లక్షల 50వేల ఎల్ఓసి చెక్కును అందజేసి గొప్ప మానవత్వాన్ని చాటుకున్నారని రాయరావుపేట గ్రామ సర్పంచ్ బొర్ర రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రంగోల సతీష్, రొంపి పోచయ్య, రొంపి నరసింహ్మ తదితరులు ఉన్నారు.

# బీబీనగర్ చెరువులో ఆత్మహత్యాయత్నం

**- 10 నిమిషాల్లో మహిళను కాపాడిన పోలీసులు**

**అక్షరకలం బిబినగర్**



కుటుంబ కలహాలు, వ్యక్తిగత సమస్యల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ మహిళ బీబీనగర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించగా, అప్రమత్తమైన పోలీసులు సకాలంలో స్పందించి ఆమెను సురక్షితంగా రక్షించారు. పోలీసులు తెలిపిన ప్రాథమిక వివరాల ప్రకారం, వివాహిత అయిన ఆ మహిళకు కుటుంబ విభేదాల కారణంగా భర్తతో దూరం ఏర్పడింది. అనంతరం మరో వ్యక్తితో పరిచయం ఏర్పడి, కొంతకాలంగా అతనితో కలిసి ఉంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆరోగ్యానికి సంబంధించిన అనుమానాల నేపథ్యంలో సదరు వ్యక్తి వైద్య పరీక్షలు చేయించగా, వాటి ఫలితాల కారణంగా ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. అనంతరం ఆ మహిళను బీబీనగర్ చెరువు కట్ట సమీపంలో వదిలి వెళ్లినట్లు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ చెరువులో దూకి ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ విషయం పోలీసులకు చేరడంతో వారు వెంటనే రంగంలోకి దిగి, కేవలం 10 నిమిషాల్లో ఆమెను గుర్తించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కౌన్సెలింగ్ కూడా నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. మహిళ ఆరోగ్య పరిస్థితి, వ్యక్తిగత పరిస్థితులు, ఘటనకు దారితీసిన అసలు కారణాలపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# ఉపాధ్యాయుడై విద్యార్థులకు బోధన

**వనపర్తి జూలై 21 ప్రతినిధి అక్షర కలం వై రమేష్,**



వనపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా"సర్"(ఓటర్ జాబితా సవరణ)లో ప్రజలు విధిగా పాల్గొనాలని అవగాహన కల్పిస్తూ మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి చేస్తున్న పర్యటనలు సత్ఫలితాలను ఇస్తుంది. ఉపాధ్యాయుడైన,మాజీ మంత్రి వనపర్తి మండలంలో అంజనగిరి గ్రామంలో ఒక ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఓటర్ జాబితా సవరణను పరిశీలిస్తూ అంజనగిరి ప్రాథమిక పాఠశాలలో కాసేపు తరగతి గదిలో ఉపాధ్యాయుడై విద్యార్థులకు ప్రత్యేక బోధన చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులంతా ప్రతిరోజు పరిశుభ్రంగా ఉండాలని శాకాహార తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండడంతో మేధాసంపత్తి పెరుగుతుందని అన్నారు. శాకాహారంలో మాంసకృత్తులకు మించి ప్రోటీన్స్ ఉంటాయని అన్నారు. కూరగాయలు, ఆకుకూరలు పట్ల ఉపాధ్యాయులు పిల్లలకు అవగాహన కల్పించాలని అన్నారు. కూరగాయల వినియోగం వల్ల లాభాలను నిరంజన్ రెడ్డి వివరిస్తూ నేను క్యారెట్ తినకపోవడం వల్ల కళ్ల అద్దాలు వచ్చాయని చమత్కరించారు. బోర్డు మీద నియోజక వర్గం, గ్రామాల,రాష్ట్ర పేర్లు వ్రాసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు.ప్రజలతో,విద్యార్థులతో నిరంజన్ రెడ్డి కలిసిపోవడం చూసిన గ్రామస్థులు నాయకులు,కార్యకర్తలు పదవి ఉన్నా లేకున్న ప్రజల పట్ల తన ఆతృతను చూపుతున్న నిరంజన్ రెడ్డి సేవాభావాన్ని కొనియాడారు.ఉపాధ్యాయులు తమ పాఠశాలకు వచ్చి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మా యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు కె.మాణిక్యం, రఘువర్ధన్ రెడ్డి,రవిప్రకాష్ రెడ్డి,మాధవ్ రెడ్డి, నాగవరం. నరేష్,డేగ.మహేశ్వర్ రెడ్డి,చిట్యాల.రాముజిల్లా మీడియా కన్వీనర్నందిమల్ల.అశోక్ ఉన్నారు.

# రహదారి ప్రమాదాల నివారణకు కృషి చేయాలి.

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**



రహదారి ప్రమాదాలతో ఏటా ఎంతో మంది మృత్యువాత పడడమే కాక క్షతగాత్రులుగా మారుతున్నారని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ రహదారి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలపై మంగళవారం హైదరాబాద్ నుంచి బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రహదారుల భద్రతకు తమ వంతుగా కృషి చేస్తుందని, ఆయా జిల్లాల పరిధిలోని సంబంధిత శాఖల అధికారులు వారికి సహకరించాలన్నారు. రవాణా, పోలీస్, ఆర్ అండ్ బి, తదితర శాఖల అధికారులతో కలిసి జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలను ఎన్నుకోవాలన్నారు. జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలు, హైవే సేఫ్టీ టాస్క్ ఫోర్స్ కమిటీలతో కలిసి పని చేసేందుకు తరచూ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసీ అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, రోడ్ సేఫ్టీ కమిటీలు ఇప్పటివరకు రహదారి భద్రతపై నిర్వహించిన కార్యక్రమాల వివరాలను అడిగారు. హైవేలపై పెట్రోలింగ్ వాహనాల సేవలు, బ్లాక్ స్పాట్ల వద్ద తీసుకుంటున్న జాగ్రత్తలపై మాట్లాడారు. హైవే స్థలాలను ఆక్రమించి ఏర్పాటు చేసిన దాబాలు, ఇతర నిర్మాణాల యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. హైవేల భద్రతకు సంబంధించి ఇదివరకు నిర్వహించిన కార్యక్రమాలు, సమావేశాలు, భవిష్యత్తులో చేయబోయే కార్యాచరణ ప్రణాళికపై ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికలను సమర్పించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో కలెక్టరేట్ ఇన్చార్జి ఏవో మంజుల, నేషనల్ హైవే రేసిడెంట్ ఇంజనీర్ బాలచందర్, రవాణా, ఆర్ అండ్ బి శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం

## ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ:

**హైదరాబాద్ : జులై 21,( అక్షర కలం న్యూస్ ):**



మంగళవారం బల్కంపేట్ ఎల్లమ్మ అమ్మ వారి కళ్యాణ మహోత్సవం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది.ఈ కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి తిలకించారు. తదుపరి అమ్మవారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా సీఎం కుటుంబ సభ్యులు, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులు, కొండా సురేఖ కుటుంబ సభ్యులు, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ కుటుంబ సభ్యులు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య రెడ్డి, శాసనసభ్యులు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, నవీన్ యాదవ్ ల రాకతో దేవాదాయ శాఖ అధికారులు ఆలయ మర్యాదలతో గౌరవ స్వాగతం పలికారు. దేవాదాయ శాఖ అమ్మ వారి కళ్యాణం తిలకించేందుకు వచ్చే భక్తులు, పుర ప్రజలకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మెరుగైన వసతులు కల్పించడం జరిగింది.దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ చైర్మన్ సాయిబాబా, కళ్యాణ మహోత్సవ నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా చేపట్టారు. త్రాగునీరు విద్యుత్ నిరంతరంగా ఏర్పాటు చేపట్టారు. భక్తులకు ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరికి అమ్మవారి కళ్యాణం తికలించేలా, దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేపట్టారు. కళ్యాణం తదుపరి కూడా అమ్మవారిని దర్శించుకొనుటకు భక్తులు ప్రజలు తండోపతండాలుగా తరలివస్తున్నారు.ఈ కళ్యాణ మహోత్సవంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా,డిసిపి ట్రాఫిక్ కాజల్ సింగ్, జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, ఈవో వినోద్ రెడ్డి, విద్యుత్ జిహెచ్ఎంసి, హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్, మెడికల్, రెవెన్యూ, దేవాదాయ శాఖ, పోలీస్ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సత్య సాయి ఆగ్రో రైస్ మిల్ ఇండస్ట్రీస్ లో తనిఖీలు.....

**- జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద.....**



**మెదక్/ కొల్చారం జూలై 21 (అక్షరక లం):-**

సోమవారం రోజున విజిలెన్సు అండ్ ఎన్ఫోర్స్మెంట్ టీం, రామచంద్రాపురం, మెదక్ జిల్లా పౌర సరఫరల అధికారి, అసిస్టెంట్ పౌర సరఫరల అధికారి, ఇన్స్పెక్టర్ (సివిల్ సప్లై) వారు సంయుక్తంగా కలిసి మెదక్ జిల్లా లోని కొల్చారం మండలం గ్రామం లో గల శ్రీ సత్య సాయి ఆగ్రో రైస్ మిల్ ఇండస్ట్రీస్ లో తనిఖీలు చేయడం జరిగింది.ఈ తనిఖిలలో ఖరిఫ్ (2025-26) సీజన్ కి సంబదించిన 3029.960 మెట్రిక్ టన్నుల ధాన్యం (75, 749 బ్యాగులు) తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తక్కువగా ఉన్న 3029.960 మీ'ం ధాన్యం యొక్క విలువ 7,17,79,752.40/-. తదుపరి సదరు రైస్ మిల్ యజమాని అయిన ఐ. శ్రీనివాస్ పై జుజ౼ూష్ -1955 కింద 6-ూ కేసు నమోదు చేసి, తదుపరి చర్యల కొరకు మెదక్ జిల్లా కలెక్టర్ గారికి నివేదిక సమర్పించడం జరిగిందని మంగళవారం ఒక ప్రకటన తెలిపారు.

# యువ నేత సమస్య అంటే సత్వరం స్పందించే గొప్ప మనస్తత్వం....

**- సమర్థవంతమైన నాయకుడిగా గుర్తింపు....**

**- నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలి....**

**- కొల్చారం మండలం బిఆర్ఎస్ మండల పార్టీ నేతలు....**

**- ఘనంగా సంతోష్ రావు జన్మదిన వేడుకలు...**

**మెదక్ /కొల్చారం జూలై 21(అక్షర కలం):-**







కొల్చారం మండల బిఆర్ఎస్ పార్టీ యువత విభాగం అధ్యక్షుడు, యువ నాయకుడు తుంకులపల్లి సంతోష్ రావు జన్మదిన వేడుకలను సోమవారం నాడు మండలంలోని తుక్కాపూర్, సీతారాం తండా, చిన్న ఘనాపూర్ గ్రామాలలో సంతోష్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలలో సంతోష్ రావు విద్యార్థులకు, యూత్ పిల్లలకు ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా గుర్తుంటాయని, కొన్ని గ్రామాలలో యూత్ నాయకులకు క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లు అందజేసిన ఘనత తుంకులపల్లి సంతోష్ రావు అని వివిధ గ్రామ యువ నాయకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల యువ నాయకులు మాట్లాడుతూ సంతోష్ రావు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేండ్లు వర్ధిల్లాలని వారు తెలిపారు. సీతారాం తండాలో మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో సంతోష్ రావు జన్మదిన వేడుకల సందర్భంగా పంచాయతీ ఆవరణలో కేక్ కట్ చేసి సంతోషాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో గ్రామ ఉపసర్పంచ్ ఆరే రవీందర్ ఆధ్వర్యంలో సంతోష్ రావు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు తెలిపారు. మండలంలోని చిన్న ఘనపూర్ గ్రామంలో బి ఆర్ ఎస్ వి కొల్చారం మండలం వైస్ ప్రెసిడెంట్ బైకరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో యువ నాయకులు గ్రామ పంచాయతీ ఆవరణలో సంతోష్ రావు జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**హుజురాబాద్, జూలై21 ( అక్షర కలం ) :**

హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన కంప్యూటర్స్, గణితం సబ్జెక్టుల్లో ఒక్కొక్క అతిథి అధ్యాపకుల (గెస్ట్ ఫ్యాకల్టీ) నియామకం కోసం అర్హులైన, ఆసక్తి కలిగిన పోస్ట్ గ్రాడ్యుయేట్ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి .ఇందిరా దేవి తెలిపారు. అభ్యర్థులు ఎస్సీ, ఎస్టీలు అయితే 50 శాతం, ఓసీ, బీసీలు అయితే 55 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసి ఉండాలన్నారు. అలాగే నెట్, సెట్, పీహెచ్‌డీలలో ఏదైనా ఒకటి అదనపు అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అలాగే ఇంగ్లీష్ మీడియంలో బోధించగలిగే సామర్థ్యం ఉండాలన్నారు.ఒకవేళ ఇట్టి పోస్టుకు నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హులు అప్లై చేసుకోకపోతే డిగ్రీ స్థాయిలో బోధన అనుభవం కలిగిన వారికి మాత్రమే అవకాశం ఇవ్వబడుతుందన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు ఒక సెట్ జిరాక్స్ ప్రతులను జతచేస్తూ దరఖాస్తులను ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుజురాబాద్ లో జూలై 24వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు అందజేయాలని,జూలై 27ఉదయం 11 గంటలకు కళాశాలలో డెమో, ఇంటర్వ్యూ నిర్వహిస్తామని , గడువు తేదీలోగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో హాజరు కావలెను అని ప్రిన్సిపాల్ తెలిపారు.



# జాతీయ రహదారులపై ప్రమాదాల నియంత్రణే లక్ష్యం.....

**- స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్.....**

**- అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష.....**

**- హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్......**

**మెదక్/ కొల్చారం జూలై 21(అక్షర కలం):-**

జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యమని స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్ స్పష్టం చేశారు. జాతీయ రహదారులపై రోడ్డు భద్రత చర్యలపై స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, పోలీస్ శాఖ, జాతీయ రహదారి శాఖ అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరయ్యారు. స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారుల వెంట భారీ వాహనాలు,



ట్రక్కులు పార్కింగ్ చేయవద్దని సూచించారు. నిర్దేశిత ప్రాంతాలు మినహా ఎక్కడా వాహనాలు పార్కింగ్ చేయవద్దని స్పష్టం చేశారు. అలాగే రోడ్డుపై ఆక్రమణలు ఉండకుండా చూడాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు అధికారులు, పోలీసులు, జాతీయ రహదారుల అధికారులతో టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే జాతీయ రహదారుల వెంట పోలీస్, రవాణా శాఖ అధికారుల పెట్రోలింగ్ వాహనాలు ఎప్పుడూ పెట్రోలింగ్ చేసేలా చూడాలని సూచించారు. ఆ వాహనంలో అత్యవసర సేవలు అందించే సామాగ్రి అందుబాటులో ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తమ జిల్లా పరిధిలో అన్ని ఆసుపత్రుల వివరాలు, ట్రామా కేర్ సెంటర్ల వివరాలు మ్యాపింగ్ చేసి అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాలని సూచించారు. అన్ని జిల్లాల్లో బ్లాక్ స్పాట్స్ గుర్తించి.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**- ప్రభుత్వ ఆదేశాలు పక్కాగా అమలు.....**

రోడ్డు భద్రత కింద జారీ చేసిన ఆదేశాలను జిల్లాలో పక్కాగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. జాతీయ జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు జాతీయ రహదారుల వెంట గుర్తించిన బ్లాక్ స్పాట్స్ సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. టాస్క్ ఫోర్స్ ఆద్వర్యంలో జిల్లాలో చేపట్టిన పనులపై ఆరా తీసి భవిష్యత్తు ప్రణాళికలపై దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లోఆర్ అండ్ బి. ఈ.ఈ శంకర్ ,అరుణ్, జాతీయ రాహదారుల అధికారులు దివ్య,వేణు,వినోద్, ట్రాన్స్పోర్ట్ అధికారి విజయ లక్ష్మి,, తదితరులు పాల్గొన్నారు.

# ఫణిగిరి కాలనీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణంలో పాల్గొన్న చైతన్యపురి డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్:



**హైదరాబాద్ : జులై 21, ( అక్షర కలం న్యూస్ ):**

స్వస్తి శ్రీ వర్ధమాన వ్యావహారిక చంద్రమాన పరాభవ నామ సంవత్సర ఆషాడ మాసం సందర్భంగా చైతన్యపురి డివిజన్ లోని కనిగిరి కాలనీలో రేణుక ఎల్లమ్మ కళ్యాణం ఘనంగా జరిగాయి ఆలయ నిర్మాణ వ్యవస్థాపకులు శ్రీమతి సోమ వెంకటమ్మ, సోమ యాదగిరి, సోమ యాదగిరి గారి ఆధ్వర్యంలో ఈ కళ్యాణం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైతన్యపురి డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్ ఎల్లమ్మ కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి తోట మహేష్ యాదవ్ మాట్లాడుతూ, అమ్మవారి దయవలన ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో ఉండాలని ఆయన కోరుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తోట మహేష్ యాదవ్ కు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ కు చెందిన నాయకులు రాజేష్ ఎలవర్తి సాయి కిరణ్ బసాని బాలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగంలో మెదక్ జిల్లా ఖ్యాతి జాతీయస్థాయికి ఎదగాలి.....- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్....

**- పర్యాటక రంగంలో మెదక్ జిల్లా విశేష ఖ్యాతి...- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.....**

**మెదక్/ కొల్చారం జూలై 21(అక్షర కలం):-**

మెదక్ జిల్లా హావేలిఘనపూర్ మండలం పోచారం అభయారణ్యంలో క్యాంప్ ఫైర్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, డి ఎఫ్ ఓ జోజి, జిల్లా పర్యాటక శాఖ అధికారి రమేష్ గంగాల, హవేళీఘన్పూర్ తాహసిల్దార్ సింధు రేణుక, డిపిఆర్ఓ రామచంద్ర రాజు.మెదక్ జిల్లాలో గల పర్యాటక, చారిత్రాత్మక వారసత్వ, ఆధ్యాత్మిక మరియు అభయారణ్యాలతో పర్యాటక సర్క్యూట్ రూపొందించడం జరుగుతుంది.జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సీనియర్ కన్సల్టెంట్స్ శవంతి గుప్తా, భువన్ ల బృందం గత ఐదు రోజులుగా కొనసాగిన పలు పర్యాటక ప్రదేశాల సందర్శన ముగింపు తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు. సూచనలు సలహాలు,తెలంగాణ టూరిజం (పర్యాటక మరియు సాంస్కృతిక) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్, గారి ప్రత్యేక చొరవ మెదక్ శాసనసభ్యులు, మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక శ్రద్ధ, ప్రజా ప్రతినిధులు సహకారంతో పర్యాటక స్ఫూర్తితో ముందుకు

సోమవారం రాత్రి హవేలీ ఘన్పూర్ మండలం పోచారం అభయారణ్యంలో క్యాంప్ ఫైర్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంముఖ్యమంత్రివర్యులు ఆదేశాల మేరకు రాష్ట్ర పర్యాటక పురావస్తు శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు. సూచనలు



సలహాలు,తెలంగాణ టూరిజం (పర్యాటక మరియు సాంస్కృతిక) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్, గారి ప్రత్యేక చొరవ , మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు , మైనంపల్లి రోహిత్ రావు , ప్రత్యేక దృష్టితో ప్రజా ప్రతినిధులు సహకరించిన తీరు మరువలేనిదని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు.మెదక్ జిల్లాలోని పర్యాటక సుందర ప్రకృతి రమణీయ వాతావరణానికి ప్రసిద్ధి చెందిన పోచారం అభయారణ్యంలో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంప్ ఫైర్ కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో జరిగిందని తెలిపారు.మెదక్ జిల్లాలోని పర్యాటక, చారిత్రాత్మక వారసత్వ ఆధ్యాత్మిక అభయారణ్యాలతో ఒక సర్క్యూట్ రూపొందిస్తున్నట్టు తెలిపారు .రాష్ట్రంలో పర్యాటక రంగ పర్యాటకశాఖ జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరచాలని ఉద్దేశంతో జిల్లాలో ఉన్న చారిత్రాత్మక ఆధ్యాత్మిక వారసత్వ కట్టడాలతో పాటుగా మెదక్ కు తల మాణికమైన పోచారం అభయారణ్యంప్రాంతాలను అభివృద్ధిపరిచి పర్యాటక రంగంలో మెదక్ జిల్లాకు విశేష గుర్తింపులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో తీసుకురావడానికి కృషి ప్రయత్నంలో భాగంగా గత ఐదు రోజులుగా జిల్లాలోని అనేక ప్రాంతాలను జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సీనియర్ కన్సల్టెంట్స్ శవంతి గుప్తా, భువన్ ల బృందం పర్యాటక ప్రదేశాల సందర్శన ముగింపు దశకు చేరుకున్నట్లు తెలిపారు. డీఎఫ్ఓ జోజి, జిల్లా పర్యాటక శాఖ అధికారి రమేష్ గంగాల, హవేలీ ఘనపూర్ తాహసిల్దార్ సింధు రేణుక , ఈడియం సందీప్, అధికారులు పాల్గొని ప్రకృతి అందాలను ఆస్వాదించారు. క్యాంప్ ఫైర్ చుట్టూ సమావేశమైన అధికారులు జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి, పోచారం అభయారణ్యాన్ని మరింత ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై పరస్పరం చర్చించారు.ప్రకృతి ఒడిలో నిర్వహించిన ఈ కార్యక్రమం అందరికీ ఆహ్లాదాన్ని పంచడంతో పాటు పరస్పర సమన్వయాన్ని పెంపొందించేందుకు దోహదపడిందని అధికారులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పోచారం అభయారణ్యంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి అడవుల పరిశుభ్రతను కాపాడాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగానికి చెందిన పలువురుఉన్నతాధికారులు, అటవీ శాఖ అధికారులు, పర్యాటక శాఖ అధికారులు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఖభర్దారు కాంగ్రెస్ నాయకులరా

## నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకపోతే సహించేది లేదు

**అక్షర కలం సిద్దిపేట జూలై 21:**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుందని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సూరగొని రవి గౌడ్ తెలిపారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చందులాపూర్ గ్రామంలోని మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు,జడ్పీ చైర్ పర్సన్ వెలేటి రోజా రాధాకృష్ణ శర్మను విమర్శించే స్థాయి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ నీకు లేదని హెచ్చరించారు. రంగనాయక సాగర్ ప్రాజెక్టు నుంచి చందులాపూర్ రామంచ గ్రామాలకు నీటి తరలింపుకు 6 కోట్ల రూపాయలతో గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం హాయంలోనే లిఫ్ట్ ఇరిగేషన్ కు భూమి పూజ ప్రారంభించినట్లు తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను నిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆపవేసినట్లు మండిపడ్డారు. రైతుల కష్టాలు దృష్టిలో ఉంచుకొని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని కలిసి వినతి పత్రం హరీష్ రావు అందజేసినట్లు తెలిపారు. ఇక అభివృద్ధి విషయానికి వస్తే అల్లిపురంలో ఎంత అభివృద్ధి జరిగింది చంద్రాపూర్లో ఎంత అభివృద్ధి జరిగిందో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రంగనాయక సాగర్ ప్రాజెక్టు ద్వారా ఎంతో మంది రైతుల్లో జీవితాల్లో వెలుగులు నిండినట్లు తెలిపారు. చందలాపూర్ గ్రామం ఎంత అభివృద్ధి జరిగిందో ఇక్కడికి వచ్చి చూస్తే నీకు అర్థం అవుతుందని మహేందర్ కు సూచించారు.నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకపోతే సహించేది లేదని హెచ్చరించారు. విమర్శలు మానుకొని రైతులకు సాగునీరు వచ్చే విధంగా దృష్టి పెట్టాలనికోరారు.మీముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గరికి వెళ్లి ప్రాజెక్టులు నింపమని వినతి పత్రాలు అందజేసి రైతులకు సాగునీరు అందించే విధంగా ముందుకు రావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సందిల భద్రయ్య, బల్ల ప్రభు, బుచ్చగారి మల్లేశం, గుడిసె శ్రీనివాస్, రైతులు కుమ్మరి శంకరయ్య, బుర్ర వెంకట్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955